విశాఖపట్టణం
శుక్రవారం 2 అక్టోబర్ 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 231 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## యువత ఆకాంక్షలకు ప్రతీక
# యూపీఎస్సీ

ప్రతి ఉద్యోగి పేదల ఆవేదనను అర్థం చేసుకోవాలి
సిటిజన్ ఫస్ట్ అనేది సివిల్ సర్వీస్ ఉద్యోగుల లక్ష్యం
ఢిల్లీలో యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని మోదీ
స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌ను ఆవిష్కరించిన ప్రధాని

2

## బీసీలకు 34 శాతం
# రిజర్వేషన్లు కుదరవు

50 శాతానికి మించి ఉండరాదని సుప్రీం పేర్కొంది
ప్రభుత్వం జారీ చేసిన జీఓలు 105, 1065ల రద్దు
స్థానిక ఎన్నికల వేళ హైకోర్టు సంచలన తీర్పు
సుప్రీం కోర్టుకు వెళ్లాలని చంద్రబాబు నిర్ణయం




(అమరావతి - జయజయహే)

స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన వర్గాలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే వ్యవహారం అత్యున్నత న్యాయస్థానానికి చేరనుంది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లు వర్తింపజేస్తూ కూటమి ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం. 105, 1065లను రద్దు చేస్తూ ఏపీ హైకోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించింది. సుప్రీంకోర్టు నిర్దేశించిన 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఉన్నాయనే కారణంతో హైకోర్టు ఈ ఉత్తర్వులను కొట్టివేసి, ఆరు వారాల్లోగా ఎన్నికల ప్రక్రియను చేపట్టాలని ఆదేశించింది. అయితే, బీసీల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా హైకోర్టు తీర్పును గౌరవిస్తూనే, దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించి చట్టబద్ధమైన న్యాయపోరాటం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం దృఢ నిర్ణయం తీసుకుంది. రేపే సుప్రీంకోర్టులో పిటిషన్ వేస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఈ పరిణామంపై టిడిపి ఎంపీ చింతకాయల విజయ్ తీవ్రస్థాయిలో స్పందించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. బీసీలు కేవలం ఓటర్లుగానే మిగిలిపోకూడదని, పాలసీ మేకర్లుగా, బలమైన నాయకులుగా సమాజంలో ఎదగాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ఆశయమని పేర్కొన్నారు. కానీ, ఎలాగైనా స్థానిక ఎన్నికలను నిలిపివేయడంతో పాటు బీసీలకు 34% రిజర్వేషన్లు దక్కకుండా చేయాలనే కుట్రతోనే ..మిగతా 2లో



# సుప్రీంకు వెళ్తాం

హైకోర్టు తీర్పును సవాల్ చేస్తాం
బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై వెనకడుగేయం
సీఎం చంద్రబాబు స్పష్టీకరణ
ఏజీ దమ్మాలపాటి శ్రీధర్‌తో భేటీ

(అమరావతి - జయజయహే)

బీసీ రిజర్వేషన్లపై ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీ హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్లాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ వ్యవహారానికి సంబంధించి అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్‌తో పాటు సీనియర్ న్యాయనిపుణులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. వచ్చే సోమవారంలోపు అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ వేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈలోపు బీసీ రిజర్వేషన్లను అడ్డుకునేందుకు వైసీపీ చేసిన ప్రయత్నాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పార్టీ నేతలకు సూచించారు. ఢిల్లీలో ప్రభుత్వం వేసే పిటిషన్‌పై వాదించేందుకు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులను నియమించాలని సీఎం ఆదేశించారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు స్పష్టం ..మిగతా 2లో

# 76 శాతం యూపీఐకి దూరం

ప్రత్యామ్నాయంగా నెఫ్ట్, ఐఎంపీఎస్
లోకల్ సర్కిల్స్ సంస్థ సర్వేలో వెల్లడి
ఎండీఆర్ వసూళ్లపై సామాన్యులు మనోగతం

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

దేశవ్యాప్తంగా కోట్లాది మంది రోజువారీ చెల్లింపులకు ఉపయోగిస్తున్న యూపీఐ వ్యవస్థలో అక్టోబర్ 15 నుంచి కీలక మార్పు రానుంది. రూ.2,000కు మించిన కొన్ని పర్సన్ టు మర్చంట్ చెల్లింపులపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్ అమల్లోకి రానుంది. ఈ ఛార్జీని నేరుగా వినియోగదారుల నుంచి వసూలు చేయరాదని వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, దీనిపై దేశవ్యాప్తంగా వ్యాపారుల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఎండీఆర్‌పై లోకల్ సర్కిల్స్ సంస్థ సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో ..మిగతా 2లో




## ఆరువారాల్లో స్థానిక
# ఎన్నికలు జరపాలి

ఆలస్యం చేసేలా దాఖలైన పిటీషన్ల కొట్టివేత
సర్ ప్రక్రియ పూర్తయ్యాకే జరపాలన్న వైసీపీ పిటీషన్ డిస్మిస్
విలీన పిటీషన్లను కూడా తిరస్కరణ
హైకోర్టు కీలక తీర్పు,.. ఈసీకి ఆదేశాలు

2






## గిరిజనుల విజ్ఞానానికి ప్రతీక
# అరకు కాఫీ

కఠోర శ్రమ, సువాసనకు నిదర్శనం
ఎక్స్ లో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

(అమరావతి - జయజయహే)

అరకు కాఫీని మన ప్రాంతానికి సంబంధించిన ఒక మధురమైన జ్ఞాపకంగానూ, గిరిజన వర్గాల కఠోర శ్రమకు నిదర్శనంగానూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభివర్ణించారు. అంతర్జాతీయ కాఫీ దినోత్సవం సందర్భంగా రాష్ట్రానికి గర్వకారణమైన అరకు కాఫీ విశిష్టతను కొనియాడారు. అదేవిధంగా దానిని పండించే గిరిజన రైతుల శ్రమను గుర్తిస్తూ ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. ప్రపంచ వ్యాప్తంగా విస్తరించేందుకు కృషి : గిరిజన రైతుల కఠోర శ్రమ తత్వం అరకు కాఫీలోని ప్రతి కప్పులోనూ ప్రతిబింబిస్తుందని ఆయన పేర్కొన్నారు. పార్లమెంటు ..మిగతా 2లో

## వెనుకబడిన వర్గాలకు
# బాబు వెన్నుపోటు

అమలు సాధ్యం కాదని తెలిసే ఉత్తుత్తి జీఓలు
మంజునాథ, రాజీవ్ రంజన్ కమిషన్‌ల నివేదికలు ఏమయ్యాయి
చిత్తశుద్ధి ఉంటే కేంద్ర ఒత్తిడి తేవాలి
ఎంపీలు రాజీనామా చేసి కేంద్రాన్ని పట్టబట్టాలి
వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి డిమాండ్

(విశాఖపట్నం - జయజయహే)



రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాలకు నిజంగా న్యాయం చేయాలన్న చిత్తశుద్ధి వెన్నుపోటు పార్టీ సారథ్యంలోని ప్రభుత్వానికి ఉంటే వెంటనే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి, అవసరమైన చట్టపరమైన చర్యలు చేపట్టాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కల్యాణి సవాల్ చేసారు. బీసీల రిజర్వేషన్ల సాధన కోసం కూటమి పార్టీల ఎంపీలు రాజీనామాలు చేస్తే, ఏకంగా కేంద్ర ప్రభుత్వమే కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. తద్వారా కేంద్రం దిగివచ్చి బడుగులకు అవసరమైన 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసే చర్యలు చేపడుతుందని సలహా ఇచ్చారు. కేంద్రంపై ఒత్తిడి తేకుండా బీసీలకు ఇచ్చిన 34 శాతం రిజర్వేషన్ హామీని ఎలా అమలు ..మిగతా 2లో

## పీఆర్సీ కమిషనర్‌గా
# దినేశ్ కుమార్

ఏడాదిలోగా నివేదికను అందించాలి
రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

(అమరావతి - జయజయహే)

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎదురుచూస్తున్న 12వ వేతన సవరణ సంఘం సిఫార్సుల కోసం కొత్త కమిషనర్ నియామకం పూర్తయింది. 1983 సీనియర్ ఐఏఎస్ దినేష్ కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఉద్యోగుల సౌలభ్యం, వేతన సవరణ ప్రక్రియను వేగవంతం చేసే దిశగా ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. 12వ వేతన సవరణ సంఘం కొత్త చైర్మన్ నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ ఇవాళ జీఓ ..మిగతా 2లో



# బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కుదరవు

మొదటి పేజీ తరువాయి...

వైఎస్సార్‌సీపీ నేతలు ఉద్దేశపూర్వకంగానే హైకోర్టులో పిటిషన్ వేయించారని ఆరోపించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అన్యాయాలను ఈ సందర్భంగా చింతకాయల విజయ్ వివరించారు. జగన్ మోహన్ రెడ్డి పాలనలో బీసీ రిజర్వేషన్లు ఏకంగా 24 శాతానికి పడిపోయినా, ఆనాడు సుప్రీంకోర్టుకు వెళ్లకుండా జగన్ బీసీలకు తీవ్ర ద్రోహం చేశారని విమర్శించారు. నాటి రిజర్వేషన్ల తగ్గింపు కారణంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 16,800 మంది బీసీ ప్రజాప్రతినిధులు తమ పదవులను కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో బీసీలకు సంక్షేమ రుణాలు బంద్ చేసి, వారిని కేవలం రాజకీయ దాడులకు, వేధింపులకే పరిమితం చేశారని మండిపడ్డారు. ఐదేళ్లలో చంద్రయ్య, నందం సుబ్బయ్య, అమర్‌నాథ్ గౌడ్ వంటి ఎందరో బీసీ నాయకులపై భౌతిక దాడులు, హత్యలు జరిగాయని విజయ్ గుర్తుచేశారు. అచ్చెన్నాయుడు, అయ్యన్నపాత్రుడు, కళా వెంకట్రావు వంటి సీనియర్ బీసీ నేతలపై అక్రమ కేసులు బనాయించి తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని ధ్వజమెత్తారు. మరోవైపు, బీసీలను అన్ని రంగాల్లో ప్రోత్సహించడం తెలుగుదేశం పార్టీ డీఎన్ఏలోనే ఉందని, చిన్న వయస్సులోనే బీసీ నేతలను రాజ్యసభకు పంపిన ఘనత చంద్రబాబు, లోకేష్‌లకు మాత్రమే దక్కుతుందని స్పష్టం చేశారు. ఏపీ ప్రభుత్వ నిర్ణయంతో ఇప్పుడు బీసీ రిజర్వేషన్ల సమరం దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ముంగిటకు చేరింది. కూటమి ప్రభుత్వం బీసీల ఆత్మగౌరవం, రాజకీయ ప్రాతినిధ్యం కోసం గట్టిగా నిలబడి పోరాటం చేస్తోందని ఎంపీ విజయ్ పునరుద్ఘాటించారు. రాజకీయాలకు అతీతంగా బీసీ సమాజమంతా ఏకమై, బీసీలకు ద్రోహం చేస్తూ వారి అభివృద్ధిని అడ్డుకుంటున్న వైఎస్సార్‌సీపీకి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.

మధ్యప్రాచ్యంలో మరోసారి తీవ్ర కలకలం రేపిన ఒక ప్రధాన వైమానిక భద్రతా ఘటనలో 174 మంది ప్రయాణికుల ప్రాణాలు దక్కాయి. దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు బయలుదేరిన ఫ్లైదుబాయ్ విమానం 1073 పై జరిగిన దాడి, దానికి ఒక భారతీయ పైలట్ ఎదురొడ్డి నిలిచిన తీరు అంతర్జాతీయ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. విమానం గాల్లో ఉండగా కోపైలట్ దాడికి పాల్పడగా, తీవ్ర గాయాలైనప్పటికీ పైలట్ చూపిన తెగింపు వల్లే విమానంలోని ప్రయాణికులందరూ సురక్షితంగా బయటపడ్డారు.

అంతర్జాతీయ మీడియా , ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాల ప్రకారం.. విమానంలోని కాక్‌పిట్‌లో ఉన్న భారతీయ కెప్టెన్ స్మిత్ మచ్చార్ పై ఒక దుండగుడు అకస్మాత్తుగా చాకుతో దాడి చేశాడు. కెప్టెన్ స్మిత్‌ను తీవ్రంగా పొడవడంతో ఆయన రక్తసిక్తమయ్యారు. అయితే, ఎంతో సమయస్ఫూర్తి, ప్రాణాల కంటే ప్రయాణికుల భద్రతే ముఖ్యం అనుకున్న ఆయన తీవ్ర గాయాలతోనే కాక్‌పిట్ తలుపులను అన్‌లాక్ చేయడంలో విజయం సాధించారు.

కాక్‌పిట్ డోర్ తెరుచుకోవడంతో వెంటనే అప్రమత్తమైన ఇజ్రాయెల్ ప్రయాణికులు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కి చెందిన విమాన సిబ్బంది కాక్‌పిట్‌లోకి దూసుకెళ్లారు. తీవ్రమైన ఘర్షణ అనంతరం ఆ దుండగుడిని లొంగదీసుకుని, హ్యాండ్‌కఫ్ చేసి బంధించారు. విమానాన్ని సురక్షితంగా సమీప విమానాశ్రయంలో ల్యాండింగ్ చేయడంతో ప్రయాణికులు, సిబ్బంది అందరూ హాయిగా ఊపిరి పీల్చుకున్నారు.

ఈ ఘటనపై ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రిత్వ శాఖ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ కెప్టెన్ స్మిత్ మచ్చార్‌ను రియల్ హీరోగా కొనియాడింది. భారతీయుడు, ఇజ్రాయెలీ, ఎమిరాటీ.. ఇలా వేర్వేరు దేశాలకు చెందిన వ్యక్తులు ఐక్యంగా నిలబడి ప్రదర్శించిన అసమాన ధైర్యసాహసాలు 174 మంది ప్రాణాలను కాపాడాయి. తీవ్రంగా గాయపడిన కెప్టెన్ స్మిత్ మచ్చార్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాం అని ఇజ్రాయెల్ ప్రకటించింది.

ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కెప్టెన్ స్మిత్ ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉన్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ విమానయాన భద్రతా సంస్థలు మరియు వివిధ దేశాల ప్రభుత్వాలు ఆయన చూపిన ధైర్యసాహసాలను, సమయ-స్ఫూర్తిని ప్రశంసిస్తున్నాయి. వివిధ దేశాల మధ్య ఉన్న సహకారం, విమాన సిబ్బంది సమర్థతకు ఈ ఘటన ఒక నిదర్శనంగా నిలిచింది.



## వెనుకబడిన వర్గాలకు బాబు వెన్నుపోటు

మొదటి పేజీ తరువాయి...

చేస్తారో ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేసారు. విశాఖపట్నంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, బీసీల రిజర్వేషన్ల అంశాన్ని కేవలం రాజకీయ ప్రచారానికి ఉపయోగించకుండా, రాజ్యాంగబద్ధంగా పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని హితవు పలికారు. రిజర్వేషన్లకు సంబంధించిన న్యాయపరమైన పరిమితులు, సుప్రీంకోర్టు తీర్పులు ఉన్న నేపథ్యంలో వాటిని అధిగమించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రిజర్వేషన్ల విషయంలో సుప్రీంకోర్టు తీర్పులు, రాజ్యాంగ నిబంధనలు ఉన్నాయని, వాటిని అనుసరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తు చేసారు. రాజకీయ అవసరాలకు కోసం అడ్డగోలు హామీలు ఇచ్చి సమాజంలో అట్టడుగున ఉన్న బడుగులకు ద్రోహం చేయడం తగదని వరుదు కల్యాణి ఆగ్రహం వ్యక్తం చేసారు. 50 శాతం పరిమితిని అధిగమించాల్సి వస్తే అవసరమైన రాజ్యాంగపరమైన చర్యలు చేపట్టాలన్న జ్ఞానం చంద్రబాబు నాయుడుకు లేదా అని నిలదీసారు. నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబు నాయుడికి బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అమలుకు చట్టపరమైన ప్రక్రియ అవసరం అనే సంగతి తెలియదా అని ప్రశ్నించారు. బీసీల రిజర్వేషన్లు అమలు సాధ్యం కాదు అని తెలిసి కూడా కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం జీఓలు జారీ చేయడం వెన్నుపోటు పార్టీ అధ్యక్షుడు చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యని ధ్వజమెత్తారు.

### కమిషన్ల నివేదికలపై చర్యలు ఏవీ..?

గతంలో బీసీల రిజర్వేషన్లకు సంబంధించి ఏర్పాటు చేసిన కమిషన్ల నివేదికలపై ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుందో చెప్పాలి. మంజునాథ కమిషన్, రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ వంటి కమిషన్లను ఏర్పాటు చేసి నివేదికలు తీసుకున్న తర్వాత వాటిని బుట్టదాఖలు చేసింది. ఆ నివేదికల పరిస్థితి ఏమిటో ప్రజలకు వివరించాలి.

కమిషన్ల నివేదికలను పక్కన పెట్టి కేవలం రాజకీయ ప్రకటనలతో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పడం వెనుకబడిన వర్గాలకు వెన్నుపోటు పొడవడమే. 2014 నుంచి 2019 మధ్య కాలంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యంలో నష్టం జరిగింది.

ఆ సమయంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించి ఉంటే బీసీలకు లభించే రాజకీయ అవకాశాలు మరింతగా ఉండేవి. వేలాది స్థానిక సంస్థల పదవులను బీసీలు కోల్పోయారు. అంతేగాక భారీ మొత్తంలో కేంద్ర ప్రభుత్వం నిధులు కూడా మంజూరు కాకుండా నిలిచిపోయాయి. బీసీలకు రిజర్వేషన్లు, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే విషయంలో చంద్రబాబు బాధ్యతగా లేకుండా, రాజకీయ అవసరాలే పరమావధిగా వ్యవహరించారనడానికే ఇదే నిదర్శనం.

### గ్రామగ్రామానికి వెళ్లి ద్రోహాన్ని వివరిస్తాం

కేంద్రంలో కూటమి ప్రభుత్వానికి భాగస్వామ్యంగా ఉన్న పార్టీలు తమ రాజకీయ బలాన్ని ఉపయోగించి బీసీల రిజర్వేషన్ల అంశంపై కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వారిని మభ్యపెట్టే ప్రయత్నం చేయవద్దు. 34 శాతం రిజర్వేషన్ల అమలుపై కూటమి పార్టీలు వెనుకబడిన వర్గాలకు చేస్తున్న దగాను గ్రామగ్రామానకు వెళ్లి బీసీలకు వివరిస్తాం. కూటమి ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలు, వాటి అమలు పరిస్థితిపై ద్రోహం చేస్తున్న తీరును ప్రజలకు వివరిస్తాం. వైఎస్సార్‌సీపీ బీసీల హక్కుల కోసం నిరంతరం పోరాడుతుంది. గ్రామగ్రామాన పర్యటించి బీసీలకు వాస్తవ పరిస్థితులను వివరిస్తాం. నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 50 శాతం అవకాశాలు కల్పించాలి. బీసీలకు సంబంధించిన సంస్థలు, పదవుల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలి అని వరుదు కల్యాణి డిమాండ్ చేసారు.

## 76 శాతం యూపీఐకి దూరం

మొదటి పేజీ తరువాయి...

291 జిల్లాల్లో 67 వేల మందికి పైగా పాల్గొన్నారు. ఓ వ్యాపారి అదనపు రుసుము వసూలు చేస్తే వినియోగదారులు ఏం చేస్తారనే నిర్దిష్ట ప్రశ్నకు 31,206 మంది సమాధానాలు ఇచ్చారు.

### సర్వే ఏం చెబుతోంది?

సర్వే ప్రకారం.. 31,206 మందిలో కేవలం 14 శాతం మంది మాత్రమే అదనపు ఖర్చును భరించి యూపీఐని కొనసాగిస్తామని చెప్పారు. 27 శాతం మంది ఎండీఆర్ చెల్లించేందుకు సిద్ధంగా లేమని, బదులుగా నగదు చెల్లిస్తామని పేర్కొన్నారు. 26 శాతం మంది క్రెడిట్ కార్డును ఎంచుకుంటామని, 14 శాతం మంది డెబిట్ కార్డును ఉపయోగిస్తామని తెలిపారు. 4 శాతం మంది బ్యాంక్ ట్రాన్స్‌ఫర్, నెఫ్ట్ లేదాఐఎంపీఎస్ వైపే వెళ్తామని వెల్లడించారు. 9 శాతం మంది అదనపు ఛార్జీ లేని మరో చెల్లింపు మార్గాన్ని అడుగుతామని చెప్పారు. 2 శాతం మంది కొనుగోలును వాయిదా వేస్తామన్నారు. అలాగే, 4 శాతం మంది స్పష్టమైన సమాధానం ఇవ్వలేదని లోకల్ సర్కిల్స్ సర్వే పేర్కొంది. దీంతో ఎండీఆర్ భారాన్ని వినియోగదారులపై మోపే పరిస్థితి ఏర్పడితే పెద్ద మొత్తాల చెల్లింపుల్లో యూపీఐ వినియోగం తగ్గే అవకాశం ఉందని సర్వే సూచిస్తోంది.

### యూపీఐకి 76 శాతం మంది దూరం..!

ఈ సంస్థ నిర్వహించిన సర్వేలో మరో ప్రశ్నకు ప్రజలు ఇచ్చిన సమాధానాలు ఆసక్తికరంగా ఉన్నాయి. రూ.2,000కు మించిన యూపీఐ చెల్లింపులపై ఎండీఆర్ ఉంటే భవిష్యత్తులో ఎక్కువగా ఏ పేమెంట్ విధానాన్ని ఉపయోగిస్తారని అడగగా.. 37,654 మంది ఇచ్చిన సమాధానాలు కీలకంగా మారాయి. వీరిలో 26 శాతం మంది క్రెడిట్ కార్డు వైపు మొగ్గు చూపగా.. 26 శాతం మంది నగదు లావాదేవీలు చేస్తామని చెప్పారు. 13 శాతం మంది డెబిట్ కార్డు, 11 శాతం మంది బ్యాంక్ ట్రాన్స్‌ఫర్/నెఫ్ట్ /ఐఎంపీఎస్ వినియోగిస్తామన్నారు. 20 శాతం మంది యూపీఐ ద్వారా చెల్లిస్తామన్నారు. మరో 4 శాతం మంది స్పష్టత లేని సమాధానాలు ఇచ్చారు. అంటే సర్వేలో పాల్గొన్న 76 శాతం మంది పెద్ద మొత్తాల చెల్లింపులకు యూపీఐ కాకుండా మరో మార్గాన్ని ఎంచుకునే అవకాశం ఉందని లోకల్ సర్కిల్స్ చెబుతోంది. వ్యాపారులతో లోకల్ సర్కిల్స్ మరో సర్వే నిర్వహించింది. ఇందులో 242 జిల్లాలకు చెందిన 32 వేల మందికి పైగా వ్యాపారులు పాల్గొన్నారు. అందులో కేవలం 17 శాతం మంది మాత్రమే 0.4 శాతం ఎండీఆర్ భరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అదే సమయంలో 41 శాతం మంది ఇందుకు నిరాకరించారు. మరో 9 శాతం మంది యూపీఐ చెల్లింపులను స్వీకరించడం లేదని తెలిపారు. దీంతో ఎండీఆర్‌ను వినియోగదారులపై మోపకూడదని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ.. వ్యాపారులు ఆ ఖర్చును ఎలా నిర్వహిస్తారన్నది కీలకంగా మారింది. డిజిటల్ చెల్లింపును ప్రాసెస్ చేయడానికి వ్యాపారి చెల్లించే రుసుమే మర్చంట్ డిస్కౌంట్ రేట్. ఇది బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లు, యూపీఐ యాప్‌లతో కూడిన చెల్లింపుల వ్యవస్థలోని భాగస్వాములకు వెళ్తుంది. ఇది ప్రభుత్వం లేదా ఎన్పీసీఎల్ వసూలు చేసే పన్ను కాదు.

## గిరిజనుల విజ్ఞానానికి ప్రతీక అరకు కాఫీ

మొదటి పేజీ తరువాయి...

ప్రాంగణం వరకు చేరుకుని అరకు కాఫీ తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకుందని ఆయన గుర్తుచేశారు. అరకు కాఫీ ప్రత్యేకతను ప్రధాన మంత్రి మోదీ కూడా పలు సందర్భాల్లో ప్రశంసించారని ఆయన ప్రస్తావించారు. అరకు కాఫీని ప్రపంచవ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు విస్తరించేలా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే తూర్పు కనుమలను పరిరక్షించాలని, ఈ కాఫీని పండించే గిరిజన రైతుల సంక్షేమాన్ని కాపాడాలని పవన్ కోరారు. "అరకు కాఫీలోని ప్రతి కప్పు తూర్పు కనుమల సువాసనని, మన మట్టి సారాన్ని, మన గిరిజన రైతుల శ్రమని తనలో ఇముడ్చుకుని ఉంటుంది. అరకు కాఫీ కేవలం రుచి, సువాసనలకే పరిమితం కాదు. ఇది మన అడవులకు, గిరిజన వర్గాల సాంప్రదాయ విజ్ఞానానికి ఒక ప్రతీకగా నిలుస్తుంది. తూర్పు కనుమల లోయల నుంచి ఢిల్లీలోని పార్లమెంటు భవనం వరకు ప్రయాణించి ఇది తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును పొందింది. అరకు కాఫీ ప్రత్యేకతను దానిని పండించే గిరిజన కుటుంబాల అంకితభావాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కూడా తరచుగా ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్ కొండల నుంచి అరకు కాఫీని ప్రపంచంలోని ప్రతి మూలకు చేరవేసేందుకు మనం కృషి చేయాలి. అదే సమయంలో దానిని పండించే గిరిజన రైతులను, తూర్పు కనుమలను కూడా పరిరక్షించుకోవాలి." అని పవన్ కళ్యాణ్ హితవు పలికారు.

## సుప్రీంకు వెళ్తాం

మొదటి పేజీ తరువాయి...

చేశారు. కాగా.. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఏపీ ప్రభుత్వం జారీ చేసిన జీవోలను హైకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. 6 వారాల్లో స్థానిక ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలని ఎన్నికల కమిషన్, ఏపీ ప్రభుత్వానికి ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. దీంతో హైకోర్టు తీర్పుపై సుప్రీంలో పోరాడాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. స్థానిక ఎన్నికలలో బీసీలకు ఇచ్చిన 34 శాతం రిజర్వేషన్ జీవోలను హైకోర్టు కొట్టివేయడంతో సుప్రీంకోర్టుకు వెళ్లనున్నట్లు టీడీపీ రాజ్యసభసభ్యుడు చింతకాయల విజయ్ తెలిపారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ఇవ్వాలనే నిర్ణయానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అత్యున్నత న్యాయస్థానానికి వెళ్లి పోరాడుతామని అన్నారు. బీసీల రిజర్వేషన్‌పై కూటమి ప్రభుత్వం ఇచ్చిన జీవోలను రద్దు చేయించాలని వైసీపీ కుట్రలు చేస్తోందని విమర్శించారు. రిజర్వేషన్లపై వైసీపీకి చెందిన వ్యక్తులు హైకోర్టుకు వెళ్లారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కూడా బీసీలకు రిజర్వేషన్లపై జగన్ సుప్రీంకోర్టుకు వెళ్లలేదని... బీసీలకు కేవలం 24 శాతం రిజర్వేషన్ మాత్రమే కల్పించారని అన్నారు. దీని వల్ల బీసీలు సుమారు 18 వేల పదవులు కోల్పోయారని వెల్లడించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ నేత చంద్రయ్యను నడిరోడ్డుపై నరికేశారని విజయ్ గుర్తుచేశారు. రేపల్లె నియోజకవర్గంలో అమరనాథ్ గౌడ్ అనే విద్యార్థిని సజీవ దహనం చేశారన్నారు. బీసీలను వైసీపీ నేతలు వెంటాడి వేధించారని, అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలను అణగదొక్కాలని వైసీపీ ప్రభుత్వం అపట్లో పనిచేసిందని దుయ్యబట్టారు. అందుకే 2024 ఎన్నికలలో వైసీపీకి బీసీలతో పాటు ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. బీసీలకు.. జనాభాకు అనుగుణంగా పదవులు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. రాష్ట్రంలో బీసీలకు గుర్తింపు తీసుకువచ్చింది, రాజ్యాధికారంలో వాళ్లను భాగస్వామ్యులను చేసింది టీడీపీనే అని తెలిపారు. అందుకే సుప్రీంకోర్టుకు వెళ్లాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని చింతకాయల విజయ్ పేర్కొన్నారు.

## ఆరువారాల్లో స్థానిక ఎన్నికలు జరపాలి

(అమరావతి - జయజయహే)

సుదీర్ఘకాలంగా ఉత్కంఠ రేపుతున్న స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు అత్యంత కీలకమైన తీర్పును వెలువరించింది. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక ఎన్నికల ప్రక్రియను రాబోయే ఆరు వారాల్లోపు ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. స్థానిక పోరుతో ముడిపడి ఉన్న పలు కీలక వ్యాజ్యాలు, పిటిషన్లపై గతంలోనే సుదీర్ఘ విచారణ పూర్తి చేసిన హైకోర్టు, తాజాగా తన తీర్పును వెలువరించింది. ఈ విచారణలో భాగంగా వెనకబడిన తరగతులకు కేటాయించిన రిజర్వేషన్ల జీవోలపై న్యాయస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. బీసీలకు స్థానిక ఎన్నికల్లో 34 శాతం కోటా కల్పిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 105, 1065లను హైకోర్టు రద్దు చేసింది. సుప్రీంకోర్టు గతంలో నిర్దేశించిన ప్రకారం.. ఎస్సీ, ఎస్టీ, బీసీల మొత్తం రిజర్వేషన్లు 50 శాతం గరిష్ఠ పరిమితిని దాటడానికి వీల్లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, సమకాలీన బీసీ జనాభా డేటా ఆధారంగానే 34 శాతం కోటాను ఖరారు చేశామని ప్రభుత్వం కోర్టుకు వివరించినప్పటికీ, ఆ జీవోలు చెల్లవని ఉన్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. స్థానిక పోరును అడ్డుకునేలా లేదా ఆలస్యం చేసేలా దాఖలైన పలు అనుబంధ పిటిషన్లను కూడా ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పూర్తిగా ముగిసిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. సమగ్ర బీసీ కుల గణన, విస్తృత సర్వేలు పూర్తయ్యాకే ఎన్నికలకు వెళ్లాలన్న అభ్యర్థనలను సైతం న్యాయస్థానం ఆమోదించలేదు. గ్రామ పంచాయతీలను సమీప మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో విలీనం చేయడం, వార్డుల డిలిమిటేషన్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను కూడా న్యాయస్థానం కొట్టివేసింది. హైకోర్టు తీర్పుతో ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ, మున్సిపల్ పోరుకు ఉన్న ప్రధాన న్యాయపరమైన అడ్డంకులన్నీ తొలగిపోయాయి. కోర్టు ఆదేశించిన ప్రకారం 6 వారాల్లోపు ప్రక్రియ ప్రారంభించాల్సి ఉన్నందున, రాష్ట్ర ఎన్నికల సంఘం 50 శాతం పరిమితికి లోబడి స్థానిక సంస్థల వారీగా స్థానాల పునర్విభజన, రిజర్వేషన్ల రీ-నోటిఫికేషన్‌పై కసరత్తు ప్రారంభించనుంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ స్థానాల కొత్త రిజర్వేషన్ల జాబితాను రూపొందించిన తర్వాత ఎస్‌ఈసీ అధికారికంగా స్థానిక పోరు నోటిఫికేషన్, పోలింగ్ తేదీల షెడ్యూల్‌ను విడుదల చేయనుంది. దీంతో ఏపీలోని గ్రామాల్లో, పట్టణాల్లో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. స్థానిక సమరానికి సిద్ధం కావాలని ప్రధాన రాజకీయ పార్టీలు కూడా ఇప్పటికే పనులు మట్నదలుపెట్టాయి.

## పీఆర్సీ కమిషనర్‌గా దినేశ్ కుమార్

మొదటి పేజీ తరువాయి...

ఎంఎస్ నెంబర్ . 200 జారీ చేశారు. గతంలో ఈ పదవిలో ఉన్న డాక్టర్ మన్మోహన్ సింగ్ రాజీనామా చేయడంతో ఈ పదవి ఖాళీగా ఉంటూ వచ్చింది. తాజాగా ప్రభుత్వం ఈ బాధ్యతలను అనుభవజ్ఞులైన దినేష్ కుమార్‌కి అప్పగించింది. అతని నియామకానికి సంబంధించిన పూర్తి నిబంధనలు, విధివిధానాలు త్వరలో జారీ కానున్నాయి. కొత్త కమిషనర్ బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి ఒక సంవత్సరంలోపు పీఆర్సీ నివేదికను ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుంది. ఈ కమిషనరేట్ యథావిధిగా వెలగపూడి కేంద్రంగా పని చేస్తుంది. అవసరమైన సందర్భాల్లో రాష్ట్రంలో లేదా బయట పర్యటించవచ్చు. పీఆర్సీ కోరిన సమాచారాన్ని సచివాలయ శాఖలు, అన్ని శాఖల అధిపతులు తక్షణమే అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. 12వ పీఆర్సీ కమిషన్ నియామకంపై ఏపీ జేఏసీ అమరావతి హర్షం వ్యక్తం చేసింది. మాట ఇచ్చిన నెలలోనే కీలక హామీల అమలు పట్ల సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అయితే ఇటీవలే సీఎం చంద్రబాబుతో ఉద్యోగ సంఘాల నేతలు జరిపిన చర్చలు సానుకూలంగా ముగిసిన విషయం తెలిసిందే. ఉద్యోగుల వేతన సవరణకు సంబంధించి 12వ పీసీఆర్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఛైర్మన్‌ను త్వరలో నియమిస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. 2024 జూలై 1, 2025 జనవరి 1 నుంచి పెండింగ్‌లో ఉన్న రెండు డీఏ లను అక్టోబర్ 1, 2026 నుంచి చెల్లించేందుకు అంగీకరించారు. 2022 సంవత్సరానికి సంబంధించిన సరెండర్ లీవ్ నగదును వచ్చే సంక్రాంతికి చెల్లించడంతోపాటు పోలీసు సిబ్బందికి అదనంగా మరో సరెండర్ లీవ్‌ను అక్టోబర్ నుంచి చెల్లించేందుకు ముఖ్యమంత్రి సరేనన్నారు. అలాగే పీసీఆర్ ఏర్పాటు చేసేలోగా ఐఆర్ ఇవ్వాలని ఉద్యోగ సంఘాల నేతలు కోరగా కచ్చితంగా ఇస్తామని, అందుకు కొంత సమయం కావాలని చంద్రబాబు కోరారు. పెన్షనర్లకు అదనపు క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 70 ఏళ్లు దాటిన వారికి 10 శాతం, 75 ఏళ్లు దాటిన వారికి 15 శాతం అదనపు పెన్షన్ క్వాంటమ్‌ను 2027 జనవరి నుంచి అమలు చేస్తారు. ఆరోగ్య పథకంలో ఉద్యోగులు కోరిన మార్పును సీఎం అంగీకరించారు.

# యువత ఆకాంక్షలకు ప్రతీక యూపీఎస్సీ

### ప్రతి ఉద్యోగి పేదల ఆవేదనను అర్థం చేసుకోవాలి

### సిటిజన్ ఫస్ట్ అనేది సివిల్ సర్వీస్ ఉద్యోగుల లక్ష్యం

### ఢిల్లీలో యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని మోదీ

### స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌ను ఆవిష్కరించిన ప్రధాని



**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) వందేళ్ల ప్రస్థానం లక్షలాది మంది యువత ఆకాంక్షలకు, దేశ ప్రజల నమ్మకానికి ప్రతీక అని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. గురువారం ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూపీఎస్సీ శతాబ్ది స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌తో పాటు '100 ల్యాండ్‌మార్క్ జడ్జిమెంట్స్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. నిన్న జరిగిన ఒక విమాన ప్రమాద ఘటనలో అసాధారణ ధైర్య సాహసాలు ప్రదర్శించిన భారత పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్ఛర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. "నిన్న జరిగిన ఘటనలో భారత పైలట్ కెప్టెన్ స్మిత్ చూపిన ధైర్యం, సమయస్ఫూర్తి, నిబద్ధత ప్రశంసనీయం. ఇజ్రాయెల్ ప్రధాని చెప్పినట్లుగా, 9/11 తరహా ఘోర విషాదాన్ని ఒక భారతీయుడు అడ్డుకున్నాడు" అని మోదీ అన్నారు. స్మిత్ ఘనత మనందరికీ గర్వకారణమని, తాను ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడానని తెలిపారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న స్మిత్ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని దేశ ప్రజలందరూ ప్రార్థించాలని పిలుపునిచ్చారు. యూపీఎస్సీ వందేళ్ల ప్రస్థానంపై మోదీ మాట్లాడుతూ.. "ఇది కేవలం ఒక సంస్థ వందేళ్లు పూర్తి చేసుకోవడం కాదు, ఇది లక్షలాది యువత ఆశయాల వేడుక. ప్రతి భారతీయుడు ఈ సంస్థపై ఉంచిన అచంచల విశ్వాసానికి ఇది నిలువుటద్దం. ఈ సంస్థను ఉన్నత శిఖరాలకు చేర్చిన ప్రతి ఒక్కరికీ నా అభినందనలు" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సివిల్ సర్వీసుల చరిత్రను, మహనీయుల సేవలను మోదీ గుర్తుచేసుకున్నారు. "1920లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఈ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఆనాడు బ్రిటిష్ పాలన ఉన్నప్పటికీ ఆయన సంస్కృతంలో పేపర్ రాశారని ఇక్కడి గ్యాలరీలో చూశాను. అదేవిధంగా, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశాన్ని నడపడంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారు. స్వతంత్ర భారతానికి అవసరమైన 'ఉక్కు చట్రాన్ని' (స్టీల్ ఫ్రేమ్) సర్దార్ పటేల్ అందించారు. ఈ సంస్థను దేశానికి ఒక ప్రధాన స్తంభంగా తీర్చిదిద్దారు" అని మోదీ వివరించారు. 1926 అక్టోబర్ 1న పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా ప్రారంభమైన ఈ సంస్థ, శతాబ్ద కాలంలో ఎన్నో మార్పులకు లోనై స్వతంత్ర రాజ్యాంగబద్ధ సంస్థగా రూపుదిద్దుకుందని ప్రధాని గుర్తుచేశారు. గతేడాది అక్టోబర్ 1న ప్రారంభమైన శతాబ్ది ఉత్సవాలు ఈ కార్యక్రమంతో ముగిశాయి. సెప్టెంబర్ 30, అక్టోబర్ 1 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో వివిధ రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్మన్లు, సభ్యులు, కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు, విద్యావేత్తలు, యూపీఎస్సీ అధికారులు పాల్గొన్నారు.



# మున్సిపల్ ఎన్నికలకు సర్వసన్నద్ధం!

### ఎప్పుడు వచ్చినా ఎన్నికలు నిర్వహించేలా ఏర్పాట్లు

**రాజమహేంద్రవరం, జయ జయహే: అక్టోబర్ 2**

:మున్సిపల్ సాధారణ ఎన్నికలు--2026కు అధికారులు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్‌కుమార్ ఆదేశించారు. జెఎన్ రోడ్డులోని సూర్య గార్డెన్స్‌లో గురువారం నిర్వహించిన ప్రాంతీయ సదస్సులో దృశ్య మాధ్యమం ద్వారా ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.రాజమహేంద్రవరం ప్రాంతీయ పరిధిలోని 34 పట్టణ స్థానిక సంస్థల్లో న్యాయపరమైన కేసులున్న తొమ్మిదింటిని మినహాయించి 25 సంస్థల్లో ఎన్నికల ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు. తాజా ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాలు, మౌలిక సదుపాయాలు, సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపుపై ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.సిడి ఎంఎపి. సంపత్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలను పక్కాగా పాటిస్తూ అధికారులునిష్పక్షపాతంగా

విధులు నిర్వహించాలని అన్నారు. మేయర్ ఎన్నిక ప్రత్యక్ష పద్ధతిలో జరుగుతున్నందున వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను పక్కాగా సిద్ధం చేయాలని సూచించారు. రిజర్వేషన్ల ప్రక్రియలోనూ నిబంధనలు పాటించాలన్నారు.

విజయవాడ కమిషనర్ ధ్యానచంద్ర పోలింగ్ కేంద్రాలను ముందుగానే పరిశీలించి అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. రాజమహేంద్రవరం కమిషనర్ రాహుల్ మీనా ఎన్నికలను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.

అదనపు సంచాలకుడు ఎస్. రవీంద్రబాబు ఎన్నికల ప్రక్రియపై అధికారులకు దృశ్య ప్రదర్శన ద్వారా శిక్షణ ఇచ్చారు.కార్యక్రమంలో

ప్రాంతీయ సంచాలకుడు సిహెచ్. నాగ నరసింహారావు, ఏలూరు కమిషనర్ ఎ. భానుప్రతాప్, మచిలీపట్నం కమిషనర్ బాపిరాజు, అదనపు కమిషనర్ (ఆర్ఎంసి) పి.వి. రామలింగేశ్వర్, ఉప కమిషనర్ ఎస్. వెంకటరమణ, కార్యదర్శి శైలజవల్లి తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డీఎస్పీగా కాంతారావు

### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**విశాఖపట్నం, అక్టోబర్ 1, (జయ జయహే)**



తిరుపతి డిఎస్పీ గా సంపతరావు కాంతారావును నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతిలో మహిళా పోలీస్ స్టేషన్ బాధ్యతలు అప్పగించింది. జూలై 6న పదోన్నతి కల్పించిన ప్రభుత్వం ఈ మేరకు పోస్టింగ్ యిచ్చింది. సోమవారం కాంతారావు బాధ్యతలు చేపట్టనున్నారు. విజయనగరం సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సంపతరావు కాంతారావు డీఎస్పీగా పదోన్నతి పొందారు. 1995 పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ బ్యాచ్‌కు చెందిన ఈయన ఉమ్మడి విశాఖ జిల్లాలోనే సుధీర్ఘ కాలం సేవలందించారు. ఉద్యోగ విధుల్లో బాధ్యతగా ఉంటూ అసలు సిసలైన పోలీస్‌గా నిబద్ధతతో పని చేస్తారనే గుర్తింపు ఉంది. ఎక్కడ పని చేసినా అంకిత భావంతో సేవలందిస్తుండడంతో అందరి చేత ఉత్తమ ఉద్యోగిగా మన్ననలందుకున్నారు.. ఈయన సేవలను గుర్తించిన ప్రభుత్వం పలు ఉత్తమ ఉద్యోగిగా అభినందిస్తూ ఏటా పలు అవార్డులను అందించిన చరిత్ర ఉంది. ట్రైనింగ్ ఎసఐగా 1995లో చోడవరం కేంద్రంగా బాధ్యతలు చేపట్టిన కాంతారావు నర్సీపట్నం, కొయ్యూరు, మంప...దేవరాపల్లి...జి. మాడుగుల...భీమిలి... అనకాపల్లి రూరల్...అచ్చుతాపురం...విశాఖలోని త్రీ టౌన్ లా అండ్ ఆర్డర్...క్రైం స్టేషన్లలో పని చేశారు. 2010లో ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ విజయనగరం స్పెషల్ బ్రాంచ్‌లో పోస్టింగ్ ఇచ్చారు. అక్కడి నుంచి నర్సీపట్నం టౌన్, బొబ్బిలి రూరల్, పద్మనాభం, గోపాలపట్నం ట్రాఫిక్, విజయనగరం సీసీఎస్, పీఎం పాలెం ట్రాఫిక్, సీసీఎస్ విజయనగరం లో సేవలందించారు. జోన్ 1 నుంచి ఇద్దరికే పదోన్నతి దక్కింది. అందులో కాంతారావు ఉండడంపై నగరంలోని పలువురు ప్రముఖులు ఆయనకు ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆయన స్నేహితులు, అభిమానులు, అధికారులు కూడా శుభాకాంక్షలు తెలిపారు.



# బాలయోగి బాటే ఆదర్శం

**రాజమహేంద్రవరం: జయ జయహే :**

అక్టోబర్ 2: నేటితరం నాయకులు దివంగత లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగిని ఆదర్శంగా తీసుకోవాలని గుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణ అన్నారు. బాలయోగి 76వ జయంతి సందర్భంగా కంబాలచెరువు పార్కులోని ఆయన కాంస్య విగ్రహం వద్ద గన్ని కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, గౌతమి జీవకారుణ్య సంఘం చైర్మన్ వర్రే శ్రీనివాసరావు, ఆర్యాపురం సత్యనారాయణ స్వామి దేవస్థానం చైర్మన్ మల్ల వెంకట్‌రాజు, మాజీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, దళిత నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గన్ని కృష్ణ మాట్లాడుతూ సామాన్య కార్యకర్త నుంచి లోక్‌సభ స్పీకర్‌గా ఎదిగినా బాలయోగి ఎంతో ఒదిగి ఉండేవారని, కార్యకర్తలను ఆత్మీయంగా పలకరించి గౌరవించేవారని గుర్తుచేశారు. కార్యకర్తలు కోరుకునే గౌరవాన్ని వారికి అందించడం నాయకుని లక్షణమన్నారు. పదవులు వస్తుంటాయి.. పోతుంటాయని, పదవుల్లో ఉన్నప్పుడు చేసే మంచి పనులే చిరస్థాయిగా గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. కంబాలచెరువు ప్రక్షాళనలో బాలయోగి భాగస్వామ్యం ఉందని, అందుకే ఆయన విగ్రహాన్ని అక్కడ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రస్తుతం పార్కు దుర్గంధంగా మారుతోందన్న విమర్శల నేపథ్యంలో పాలకులు ప్రత్యేక దృష్టి సారించి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని కోరారు. అనంతరం కార్యకర్తలకు మిఠాయిలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో గంగిన హనుమంతరావు, కురగంటి సతీష్, ఉప్పులూరి జానకిరామయ్య, జక్కంపూడి అర్జున్, ఎం.శ్రీనివాస్ (కాపు), మాజీ కార్పొరేటర్లు తలారి ఉమాదేవి, జవ్వాది మురళీకృష్ణ, కోరుమిల్లి విజయశేఖర్, ఇన్నమూరి రాంబాబు, మర్రి దుర్గాశ్రీనివాస్, సింహా నాగమణి, సయ్యద్ అప్సరి, సయ్యద్ ఫయాజ్, ముప్పన రుద్ర, ఎల్.వి.ప్రసాద్, నల్లం ఆనంద్, తలారి భగవాన్, రాయి అప్పన్న, కె.వి.శ్రీనివాస్, బెజవాడ వెంకటస్వామి, వానపల్లి శ్రీనివాస్, తలారి భాస్కర్, కవులూరి వెంకట్రావు, కొమ్మర్తి బాబ్జి, నూకల శ్రీనివాస్, యర్రమోతు ధర్మరాజు, మిస్క జోగినాయుడు, మోత నాగలక్ష్మి, రొక్కం సత్యనారాయణ, కర్రి కాశి విశ్వనాథ్, పేరూరి అంజి, వారాది నాగబాబు, అప్పలరాజు, మాకాని లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.





# ప్రజలతో మమేకమైన హోం మంత్రి అనిత

**పాయకరావుపేట, అక్టోబర్ 1:-(జయ జయహే)**

పాయకరావుపేట పట్టణంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత గురువారం సాయంత్రం వాకింగ్ చేస్తూ ప్రజలతో మమేకమయ్యారు. పట్టణంలోని గౌతమ్ థియేటర్ నుండి వాకింగ్ చేస్తూ ప్రజలను ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వాకింగ్‌లో భాగంగా లక్కీ షాపింగ్ మాల్ వద్దకు చేరుకున్న మంత్రి అనిత అక్కడ పనిచేస్తున్న మహిళా ఉద్యోగులతో కొంతసేపు ముచ్చటించారు. వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. అనంతరం పాయకరావుపేట నుంచి తుని వైపు వెళ్తున్న స్కూల్ బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థులతో సరదాగా ముచ్చటించారు. "హాయ్.. ఎలా ఉన్నారు.. ఏం చదువుతున్నారు?" అంటూ విద్యార్థులను పలకరిస్తూ వారితో కొంతసేపు సందడి చేశారు. విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడి వారిని ఉత్సాహపరిచారు. .అలాగే పట్టణంలోని చిన్న చిన్న వ్యాపారాలు చేసే నిర్వాహకులతో మాట్లాడిన మంత్రి.. వ్యాపారం ఎలా సాగుతోంది, స్థానికంగా పరిస్థితులు ఎలా ఉన్నాయంటూ వివరాలు అడిగి తెలుసుకున్నారు




# స్వచ్ఛతతోనే సంపూర్ణ ఆరోగ్యం: మంత్రి దుర్గేష్

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

నిడదవోలు పట్టణంలోని వీక్లీ మార్కెట్ వద్ద పురపాలక సంఘం ఆధ్వర్యంలో 'స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ హాజరై 'స్వచ్ఛతా హి సేవా' పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి స్వయంగా చీపురు పట్టి రహదారులను శుభ్రం చేయడంతో పాటు చెత్తను సేకరించి డస్ట్‌బిన్‌లో వేశారు. అనంతరం ప్రజలతో కలిసి స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు.మంత్రి మాట్లాడుతూ పరిశుభ్రత అందరి బాధ్యతని, ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛత కార్యక్రమాలు విజయవంతమవుతాయని అన్నారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిశుభ్రతను ఒక నిరంతర ప్రక్రియగా ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, మున్సిపల్ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



# పేదల సేవలో 2.0తో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

నిడదవోలు మున్సిపాలిటీ కౌన్సిల్ హాల్‌లో "పేదల సేవలో 2.0" సంక్షేమ దినోత్సవ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలైన అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, దీపం, తల్లికి వందనం, స్త్రీ శక్తి తదితర పథకాల 168 మంది లబ్ధిదారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖామంత్రి కందుల దుర్గేష్ లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, సంక్షేమ పథకాల ద్వారా అందుతున్న ప్రయోజనాలు, ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. వితంతు పింఛన్ లబ్ధిదారు ఆశాలత మాట్లాడుతూ పింఛన్ ద్వారా ఇంటి అద్దె, మందులు, విద్యుత్ బిల్లులు, రోజువారీ ఖర్చులను నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. తల్లికి వందనం లబ్ధిదారు ఎం. లావణ్య తన ఇద్దరు కుమార్తెల విద్యా ఖర్చులకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతోందని వివరించారు. సీతమ్మకు కార్యక్రమంలో పింఛన్ అందజేశారు.టిడ్కో గృహాలకు సంబంధించి బ్యాంకు, న్యాయవాది నోటీసుల సమస్యలను మహిళలు మంత్రి దృష్టికి తీసుకురాగా, అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తామని తెలిపారు. ఆటో డ్రైవర్ సేవలో అధ్యక్షుడు పొతుల సత్తిబాబు మాట్లాడుతూ విద్యుత్ బిల్లుల సమస్యల కారణంగా 10 మంది ఆటో డ్రైవర్లకు పథక ప్రయోజనాలు అందలేదని తెలిపారు. గ్రీన్ ట్యాక్స్, రోడ్లు, వాహన నిర్వహణ, ఎఫ్‌సీ సమస్యలను కూడా మంత్రి దృష్టికి తీసుకురాగా, ఆర్టీఓ అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.డ్వాక్రా మహిళలు జీరో వడ్డీ పథకానికి సంబంధించిన సమస్యలను వివరించారు. ఎస్‌వీడీ మహిళా కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు కళాశాల కాంపౌండ్ వాల్ సమస్యను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత అధికారులతో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు."పేదల సేవలో 2.0" కార్యక్రమం ద్వారా లబ్ధి--మార్పు--మిగిలిన అవసరం--తదుపరి చర్య విధానంతో సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరువ చేయడంతో పాటు, వారి సమస్యలను పరిష్కరించడమే లక్ష్యమని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. రానున్న 14 నెలల పాటు నియోజకవర్గ వ్యాప్తంగా ఈ కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఏపీయూ జె.ఎస్. సుధీర్ కుమార్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఎన్. మనోజ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ టి. క్రిష్ణవేణి, నిడదవోలు తహసీల్దార్ నాగరాజు నాయక్, నిడదవోలు ఎంపీడీవో ఆంజనేయ శర్మ, కూటమి పార్టీల నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

# రోడ్డు ప్రమాదంలో రైవాడకు చెందిన వ్యక్తి మృతి

**దేవరాపల్లి, అక్టోబర్ 1, జయ జయహే**



అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం పినగాడి సమీపంలో చిన్నయ్యపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవరాపల్లి మండలంలోని రైవాడ గ్రామానికి చెందిన శీర రమణ (52) మృతి చెందారు. బుధవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో విశాఖ నుంచి ద్విచక్ర వాహనంపై రైవాడ వస్తున్న ఆయన చిన్నయ్యపాలెం వద్ద తన వాహనాన్ని నిలిపి కాల కృత్యాలు తీర్చుకుంటుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు అతనిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే చనిపోయారు. ఈయన గత కాలంగా బిజెపి కార్యకర్తగా పనిచేస్తున్నారు. సబ్బవరం ఎస్సై సింహాచలం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

For a pure tomorrow.. జయహే

## వ్యాపార రంగంలో మూడు కీలక పరిణామాలు

(ప్రతాప్)

దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుతం భిన్నమైన మూడు పరిణామాలు ఒకేసారి కనిపిస్తున్నాయి. తయారీ రంగం వేగం పుంజుకోవడం ఆశాజనకంగా ఉంటే, కృత్రిమ మేధ ప్రభావంతో ఐటీ రంగం కొత్త సవాళ్లను ఎదుర్కొంటోంది. మరోవైపు డాలరుతో పోలిస్తే రూపాయి బలహీనపడటం దిగుమతుల వ్యయంపై ఒత్తిడి పెంచుతోంది. ఈ మూడు పరిణామాలు రాబోయే నెలల్లో దేశ ఆర్థిక గమనాన్ని ప్రభావితం చేసే అవకాశముంది.

**తయారీ రంగానికి కొత్త ఊపు**

సెప్టెంబర్‌లో భారత తయారీ రంగ కార్యకలాపాలు ఏడు నెలల గరిష్ఠ స్థాయికి చేరడం సానుకూల పరిణామం. దేశీయ మార్కెట్‌లో డిమాండ్ పెరగడంతోపాటు విదేశాల నుంచి కొత్త ఆర్డర్లు రావడం ఉత్పత్తి విస్తరణకు దోహదపడింది. మూడు నెలల మందగమనం తర్వాత పరిశ్రమల్లో నియామకాలు కూడా పెరగడం మరో ముఖ్యమైన సంకేతం. వ్యాపార సంస్థల్లో భవిష్యత్తుపై విశ్వాసం మెరుగుపడుతున్నట్లు తాజా కొనుగోలు నిర్వాహకుల సూచీ వెల్లడిస్తోంది. తయారీ రంగం బలపడితే ఉత్పత్తితోపాటు ఉపాధి, ఎగుమతులు, పెట్టుబడులు పెరిగే అవకాశం ఉంటుంది. అయితే ముడి పదార్థాల ధరలు, ఇంధన వ్యయం, ప్రపంచ వాణిజ్య అనిశ్చితులు ఈ వేగానికి సవాళ్లుగా నిలవవచ్చు.

**ఐటీ రంగంపై ఏఐ ప్రభావం**

సుమారు 315 బిలియన్ డాలర్ల భారత ఐటీ సేవల రంగం ఇప్పుడు కీలక పరివర్తన దశలో ఉంది. సెప్టెంబర్ త్రైమాసికంలో దేశంలోని ఆరు ప్రధాన ఐటీ సంస్థల ఆదాయ వృద్ధి 0.7 నుంచి 3.5 శాతం మధ్యే ఉండవచ్చన్న అంచనాలు రంగంపై నెలకొన్న ఒత్తిడిని సూచిస్తున్నాయి. కృత్రిమ మేధ వినియోగం పెరగడంతో




గతంలో ఎక్కువ మంది ఉద్యోగులతో ఎక్కువ గంటలు పనిచేసి ఆదాయం పొందే సంప్రదాయ వ్యాపార నమూనా మారుతోంది. తక్కువ సమయంలో ఎక్కువ పని పూర్తి చేయగల ఏఐ సాధనాలు సేవల ధరలపైనా ప్రభావం చూపుతున్నాయి. దాదాపు 60 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న ఈ రంగంలో ఉద్యోగుల తొలగింపుల కంటే నైపుణ్యాల మార్పిడి, ఏఐ శిక్షణ, అధిక విలువ కలిగిన సేవల వైపు మళ్లడం కీలకం. 2026లో ఇప్పటివరకు నిఫ్టీ ఐటీ సూచీ సుమారు 27 శాతం తగ్గడం మదుపరుల ఆందోళనకు అద్దం పడుతోంది.

**రూ.96కు చేరువలో రూపాయి**

డాలరుతో రూపాయి మారకం విలువ రూ.95.98 స్థాయికి బలహీనపడటం మరో కీలక పరిణామం. అమెరికా బాండ్ రాబడులు పెరగడం, డాలర్ బలపడటం, అధిక ముడిచమురు ధరలు రూపాయిపై ఒత్తిడిని పెంచుతున్నాయి. భారత్ తన ముడిచమురు అవసరాల్లో అధిక భాగాన్ని దిగుమతుల ద్వారానే సమకూర్చుకుంటున్నందున రూపాయి విలువ తగ్గితే చమురు దిగుమతి బిల్లు పెరుగుతుంది. దాని ప్రభావం రవాణా, ఉత్పత్తి వ్యయాల ద్వారా ఇతర వస్తువుల ధరలకూ విస్తరించే అవకాశం ఉంది. విదేశీ పెట్టుబడుల ప్రవాహం, చమురు ధరలు, ఆర్‌బీఐ చర్యలు ఇక రూపాయి గమనంలో కీలకం కానున్నాయి.

తయారీ రంగంలో కనిపిస్తున్న ఉత్సాహాన్ని నిలబెట్టడం, ఐటీ రంగాన్ని ఏఐ యుగానికి సిద్ధం చేయడం, రూపాయి బలహీనత వల్ల ధరలపై పడే ఒత్తిడిని అదుపు చేయడం---ఈ మూడు అంశాల్లో తీసుకునే చర్యలే రాబోయే నెలల్లో భారత ఆర్థిక వ్యవస్థ దిశను నిర్ణయించనున్నాయి.

# తుపాకీనీ ఓడించిన నూలుపోగు కథ

### అక్టోబర్ 2 గాంధీ జయంతి ప్రత్యేక శీర్షిక...




**మోహన్ దాస్ కరంచంద్ గాంధీ 1869 అక్టోబర్ రెండవ తేదీన పోరు బందర్ లో గుజరాత్ లో జన్మించారు.తల్లి పుత్లీ భాయి, తండ్రి కరంచంద్. తల్లిదండ్రుల భక్తి, నిజాయితీలు గాంధీజీ పైన చిన్నతనం నుండి బాగా ప్రభావితం చూపాయి.**

**గాంధీజీ - విద్య**

గాంధీజీ చిన్నతనంలో చాలా సిగ్గు ఎక్కువ. ఎవరితోనూ పాఠశాలలో మాట్లాడేవారు కాదు. ప్రాథమిక విద్యను అంతా పోరుబందర్ లో కొనసాగించారు. తండ్రి రాజకోటుకు బదలి అవడంతో హై స్కూల్ విద్య అక్కడ కొనసాగించారు. లెక్కలు అంటే భయం ఇంగ్లిష్ అంటే ఎక్కువ 1887లో మెట్రిక్ రెండవ ప్రయత్నంలో పాస్ అయ్యారు.ఆ తర్వాత కాలంలో భావ్ నగర్ లోని సామల్దాస్ కాలేజీలో చేరారు. కానీ ఇంగ్లీషు లెక్చరర్లు చెప్పే పాఠాలు అర్థం కాక ఐదు నెలలకే మానివేశారు 1888 - 1891లో లండన్ లో బారిష్టర్ చదువుకున్నారు 1891లో బారిష్టర్ పట్టాను అందుకున్నారు.

**గాంధీజీ నూతన విద్యా విధానం - వార్ధా విద్యా విధానం**

చదువు అంటే కేవలం పుస్తకాలకు పరిమితం కాదు. చేతి పని నేర్చుకోవడం కూడా ఒక చదివే. మాతృభాషలోనే చదువు చెప్పాలి. శరీరం మనసు ఆత్మ మూడింటికి చదువు అనేది అబ్బాలి అనేది గాంధీ వాదం. గాంధీజీ బారిష్ఠరు అనేకన్నా జీవితాన్ని చదువుతున్న నిరంతర విద్యార్థి అనుకోవాలి.

**పడి లేచిన కెరటం గాంధీజీ(1893 - 1915)**

గాంధీజీని రైలు నుండి తోసేసిన బాధపడకుండా 20వకేళ్ళు అక్కడే ఉండి భారతీ హక్కుల కోసం పోరాటం చేసిన మహనీయుడు.

**భారత్ లో చేసిన ఉద్యమాలు**

1. 1917 లో చంపారన్ నీలి రైతుల కోసం చేసిన ఉద్యమం.
2. 1918 ఖేడా ఉద్యమం రైతుల పన్ను మాఫీ కోసం చేసిన పెద్ద ఉద్యమం.
3. అహమ్మదాబాద్ మిల్ కార్మికుల కోసం చేసిన సమ్మె.
4. 1920-22 మధ్యకాలలం లో చేసిన సహాయ నిరాకరణ ఉద్యమం ఒక మైలు రాయి.
5. 1930లో చేసిన ఉప్పు సత్యాగ్రహం దీనినే దండి సత్యాగ్రహం అని 78తో మంది 24 రోజులు 384 కిలోమీటర్లు నడక దారిన వెళ్లి ఉద్యమాన్ని చేసిన మహనీయుడు గాంధీజీ.
6. 1942లో క్విట్ ఇండియా చలో చేయండి లేదా చావండి.. (డు ఆర్ డై )

**గాంధీ తత్వాలు - దినచర్య అలవాట్లు**

ప్రతీ రోజు తెల్లవారుజామున నాలుగు గంటలకు నిద్ర లేవడం.

రోజుకు 18 గంటలు పని చేయడం.

సాత్విక ఆహారాన్ని మాత్రమే భుజించడం. అనగా మేకపాలు పండ్లు కూరగాయలు మాత్రమే ఆహారంగా తీసుకునేవారు.

రోజుకు రెండు మూడు లేక రాసేవారు జీవితంలో 50 వేలకు పైగా లేఖలు రాసారు.

చరాఖ తిప్పడము రోజు తప్పని సరి పని.

**గాంధీజీ రచనలు పుస్తకాలు**

గాంధీజీ రచన లో అర్థం తో బాగుండడమే కాకుండా చేతి రాత కూడా చాలా అందంగా, దస్తూరి మంచిగా ఉండేది. జీవితంలో లక్షకు పైగా పేజీలు వ్రాసిన ఘనత గాంధీజీదే.

1. సత్యశోధన - నా అనుభవాలు

( మై ఎక్స్పెరిమెంట్స్ విత్ ట్రూత్) 1925 - 1929 మధ్యకాలంలో గుజరాత్ లో రాశారు ఈ పుస్తకం ప్రపంచంలో గొప్ప ఆత్మ కథలో ఒకటి తన తప్పులు అన్నింటిని ఇందులో రాశారు. ఎర్రవాడ జైలులో ఉన్న కాలంలో ఈ పుస్తకాన్ని రచన చేశారు.

2. హిందూ స్వరాజ్ (1909)

దక్షిణాఫ్రికా నుండి లండన్ వెళ్తున్న ఓడలో పది రోజులు రాసిన రచన ఇది.ఎడమ చేతితో రాసిన ఈ పుస్తకం నిజమైన స్వరాజ్యం అంటే ఏంటి?? అనేది వివరించి వ్రాసిన పుస్తకం.ఈ పుస్తకాన్ని తెల్ల దొరలు నిషేధించారు.

**గాంధీజీ పత్రిక - రచన**

1. ఇండియా 1919 - 32 ఆంగ్ల వార పత్రిక రచన.
2. ఇండియన్ ఒపీనియన్ దక్షిణాఫ్రికాలో వ్రాసిన పత్రిక నాలుగు భాషల్లో అనగా ఆంగ్లం తమిళం గుజరాత్ హిందీలలో ప్రచురితమయింది.
3. నవజీవన్ గుజరాత్ హిందీలో రాసిన పత్రిక.
4. 1933 - 1948 మధ్యకాలంలో హరిజనల్ కోసం ఇంగ్లీషులో హిందీ గుజరాత్లో రాసిన పత్రిక.
5. హిట్లర్ కు ప్రియమైన మిత్రుడు అంటూ యుద్ధం ఆపమని రెండు లేఖలు రాశారు 1939 - 1940 సంవత్సర కాలంలో.

**గాంధీ తత్వం - ప్రత్యేక శైలి రచన**

చిన్నపిల్లలకు అర్థమయ్యే రీతిలో అన్ని విపులీకరించి విడమర్చి తను ఆచరించి రాశారు దినచర్యను డైరీ రూపంలో రోజు రాసేవారు.

**స్వదేశీ స్వాలంబన**

విదేశలలో తయారైన వివిధ వస్తువులు వాడకం నిర్మూలించాలి, ఎక్కువగా మనదేశంలో ఉన్న వాటిని ఉపయోగించడం మంచిది అని ఎన్నో విధాలుగా తెలియచెప్పారు. ఇందులో భాగంగానే చరఖ తిప్పి ఖాది వస్త్ర తయారిని ప్రోత్సహించేవారు గ్రామాలు బాగుపడితేనే దేశాలు బాగుపడతాయి అనే నినాదాన్ని చేత పట్టిన స్వదేశ బంధువు గాంధీజీ.

**గాంధీ తత్వం నేటికీ ఎందుకు అవసరం...????**

మానవతా విలువలతో ఉన్న సమాజానికి గాంధీతత్వం చాలా అవసరం రష్యా ఉగ్రేన్ యుద్ధం ఇజ్రాయిల్ పాలిస్తే నా ఘర్షణలు మత కలహాలు వీటన్నిటికీ ఎంతో ఉపయుక్తము గాంధీజీ అహింసే.. అందుకే ఐక్యరాజ్యసమితి అక్టోబర్ 2నా “అంతర్జాతీయ అహింస దినోత్సవంగా” ప్రకటించింది. మానవులందరూ గాంధీతత్వాన్ని అవలంబించి నడుచుకుని ప్రతి అడుగులోనూ గాంధీ దేశం గా భావించి నడుస్తూ మున్ముందు కు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. మళ్ళీ మన గాంధీజీ లాంటి బిడ్డలు మన భారత దేశం లో జన్మించాలని యువత అందరు గాంధీజీ ఆశయాలు నెలబెట్టాలని ఆశిస్తూ...

**రచన**
**ఏ బాల సౌజన్యకుమారి**
**నంది అవార్ గ్రహీత,**
**తెలుగు ఆచార్యులు,**
**ఆధ్యాత్మికవేత్త, ప్రవచన కర్త**

# పండుగ వేళ వాహన మార్కెట్‌కు కొత్త జోష్

(ప్రతాప్)

**దేశీయ వాహన రంగంలో పండుగల సీజన్‌కు ముందే సందడి మొదలైంది. సెప్టెంబర్‌లో పలు వాహన తయారీ సంస్థలు మెరుగైన విక్రయాలను నమోదు చేయడం వినియోగ మార్కెట్‌లో డిమాండ్ బలంగా ఉందనే సంకేతాలను ఇస్తోంది. పండుగల సమయంలో కొనుగోళ్లు మరింత పెరుగుతాయన్న అంచనాతో డీలర్లు నిల్వలను పెంచుకోవడం, కొత్త మోడళ్ల విడుదల, రుణ సదుపాయాలు, ఆకర్షణీయ ఆఫర్లు విక్రయాలకు ఊతమిస్తున్నాయి. అయితే కంపెనీల నుంచి డీలర్లకు వెళ్లే వాహనాల సంఖ్య పెరగడమే కాకుండా, వినియోగదారులకు జరిగే వాస్తవ రిటైల్ విక్రయాలు అదే స్థాయిలో కొనసాగుతాయా అన్నదే అసలు పరీక్ష.**



హ్యుందాయ్ మోటార్ ఇండియా సెప్టెంబర్‌లో 77,916 వాహనాలను విక్రయించి సంస్థ చరిత్రలోనే అత్యధిక నెలవారీ విక్రయాలను నమోదు చేసింది. గత ఏడాది ఇదే నెలలో నమోదైన 70,347 వాహనాలతో పోలిస్తే ఇది 10.8 శాతం వృద్ధి. ఇందులో దేశీయ విక్రయాలు 57,166 కాగా, ఎగుమతులు 20,750గా నమోదయ్యాయి. దేశీయ విక్రయాలు 10.9 శాతం, ఎగుమతులు 10.4 శాతం పెరగడం విశేషం.




మహీంద్రా అండ్ మహీంద్రా కూడా సెప్టెంబర్‌లో మొత్తం 1,14,874 వాహనాలను విక్రయించి ఏడాది ప్రాతిపదికన 15 శాతం వృద్ధి సాధించింది. ప్రయాణికుల వాహన విభాగంలో 64,092 యూనిట్ల విక్రయాలతో 14 శాతం వృద్ధి నమోదైంది. ముఖ్యంగా ఎస్‌యూవీలకు కొనసాగుతున్న ఆదరణ ఈ వృద్ధికి ప్రధాన బలంగా నిలుస్తోంది. అయితే ఇదే సమయంలో మహీంద్రా ట్రాక్టర్ విక్రయాలు 66,111 నుంచి 52,100కు పడిపోయి 21 శాతం తగ్గడం గ్రామీణ మార్కెట్‌లో పరిస్థితి అన్ని విభాగాల్లో ఒకేలా లేదని సూచిస్తోంది. ఎస్కార్ట్స్ కుబోటా ట్రాక్టర్ విక్రయాలు కూడా 16.7 శాతం తగ్గాయి.

ద్విచక్ర వాహన రంగంలోనూ మిశ్రమ చిత్రం కనిపిస్తోంది. బజాజ్ ఆటో సెప్టెంబర్‌లో మొత్తం 5.38 లక్షల వాహనాలను విక్రయించి 5 శాతం వృద్ధి సాధించింది. ఎగుమతులు 32 శాతం పెరిగినా దేశీయ ద్విచక్ర వాహన విక్రయాలు 9 శాతం తగ్గి 2.94 లక్షలకు పరిమితమయ్యాయి. అంటే మొత్తం గణాంకాలు ఆకర్షణీయంగా కనిపించినా ప్రతి విభాగంలోనూ ఒకే స్థాయి డిమాండ్ లేదన్నది స్పష్టం.గత ఆర్థిక సంవత్సరంలో దేశీయ ప్రయాణికుల వాహన విక్రయాలు రికార్డు స్థాయిలో 47 లక్షలకు చేరడం భారత వాహన మార్కెట్ విస్తరణకు నిదర్శనం. ఇప్పుడు పండుగల సీజన్ ఈ జోరును ఎంతవరకు కొనసాగిస్తుందన్నది కీలకం. ముడి పదార్థాలు, ఇంధనం, రవాణా వ్యయాలు పెరగడం వల్ల కంపెనీల లాభదాయకతపై ఒత్తిడి కొనసాగుతోంది. ధరలు మరింత పెరిగితే మధ్యతరగతి కొనుగోలుదారుల నిర్ణయాలపైనా ప్రభావం పడవచ్చు.

అందువల్ల సెప్టెంబర్ గణాంకాలను పండుగల విజయానికి ముందస్తు తీర్పుగా కాకుండా సానుకూల సంకేతంగా చూడాలి. డీలర్ల వద్దకు చేరిన వాహనాల కంటే షోరూమ్‌ల నుంచి వినియోగదారుల ఇళ్లకు చేరిన వాహనాలే మార్కెట్ అసలు బలాన్ని చెబుతాయి. పండుగల తర్వాత కూడా రిటైల్ డిమాండ్ నిలబడితేనే వాహన రంగంలో కనిపిస్తున్న ఈ జోరు స్థిరమైన వృద్ధిగా మారిందని చెప్పగలం.



# విశిష్ట సేవలకు సీఐ జేడీ బాబుకు సత్కారం

### పోలీస్ కమిషనర్ నుంచి రివార్డు రావడంతో అభినందనలు

**అగనంపూడి, అక్టోబర్ 1, జయ జయహే**

పోలీస్ క్రైమ్ విభాగంలో విశిష్ట సేవలు అందిస్తూ నేరాల నియంత్రణలో ప్రతిభ కనబరుస్తున్న సౌత్ సబ్ డివిజన్ క్రైమ్ సీఐ జేడీ బాబును అగనంపూడి టీడీపీ నాయకులు అభినందించారు. గాజువాక పోలీస్ కాంప్లెక్స్‌లో 85వ వార్డు ఇన్‌చార్జి కార్పొరేటర్ ఇల్లపు ప్రసాద్, ఏడీసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ దుశ్శాలువ కప్పి సత్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జేడీ బాబు సౌత్ సబ్ డివిజన్ క్రైమ్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన రెండు నెలల్లోనే పలు దొంగతనాలు, దోపిడీలు, సైబర్ నేరాల కేసుల్లో సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ నిందితులను చాకచక్యంగా పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఆయన సేవలను గుర్తించి సిటీ పోలీస్ కమిషనర్ శంకర్ బ్రత బాగ్చి ప్రతిష్టాత్మక రివార్డులు అందజేయడం అభినందనీయమన్నారు.సీఐ జేడీ బాబు మాట్లాడుతూ.. సౌత్ సబ్ డివిజన్ క్రైమ్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఇప్పటివరకు 108 ద్విచక్ర వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆగస్టు 15న ప్రశంసా పత్రాలను కూడా స్వీకరించినట్లు చెప్పారు. గాజువాక పారిశ్రామిక ప్రాంతం కావడంతో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు ఇక్కడ నివసిస్తున్నారని, ఈ నేపథ్యంలో వివిధ రకాల మోసాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అపార్ట్‌మెంట్లు, దుకాణాలు, దేవాలయాలు, బార్‌లు, వైన్‌షాపుల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దొంగతనాల నివారణకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వివిధ ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అగనంపూడి టీడీపీ నాయకులు బండారు చందు రమేష్, పలక అచ్యుత్, అండిసబోయిన మూర్తి, సర్వసిద్ధి గోవింద్, విశాఖ జిల్లా ఆర్టీఐ హ్యూమన్ రైట్స్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ సనఖల సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

# ఎం హెచ్ జె సి మినిస్ట్రీస్ వార్షికోత్సవ వేడుకలు

### ముఖ్య అతిథిగా జాన్ వెస్లీ

**గాజువాక (జయ జయహే)**

తుంగలంలో ఎం హెచ్ జె సి మినిస్ట్రీస్ 35వ వార్షికోత్సవ కార్యక్రమం క్రిస్టియన్ సోషల్ వెల్ఫేర్ అండ్ అవేర్నెస్ సొసైటీ సహకారంతో నిర్వహించారు . ఈ కార్యక్రమం లో ముఖ్యఅతిథిగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు బొల్లవరపు జాన్ వెస్లీ పాల్గొన్నారు . ఈ కార్యక్రమానికి ఆర్చ్ బిషప్ శామ్యూల్ లోపింటి అధ్యక్షత వహించారు .ఈ సందర్భంగా లోపింటి శామ్యూల్ మాట్లాడుతూ ఈ సంస్థ 35 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కార్యవర్గ సభ్యులందరికీ అభినందన తెలియజేశారు. తమ సంస్థకు వెన్నెముకగా నిలిచిన క్రిస్టియన్ సోషల్ వెల్ఫేర్ అండ్ అవేర్నెస్ సొసైటీ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించమని ఏసుప్రభు వారు చెప్పిన మాటలను ఆదర్శంగా తీసుకొని ఈ సంస్థను స్థాపించడం జరిగిందని, ఈ సంస్థ ద్వారా ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు క్రైస్తవులకు అందించడం జరిగిందని తెలియజేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన బొల్లవరపు జాన్ వెస్లీ మాట్లాడుతూ ఏదైనా ఒక సంస్థను స్థాపించడం చాలా సులువు అని ఆ సంస్థను



కొనసాగించడమే కష్టమని తెలియజేస్తూ 35 సంవత్సరాలు విజయవంతంగా ఈ సంస్థను నడిపించిన ఘనత లోపింటి శామ్యూల్ కు దక్కుతుందని తెలియజేశారు. ఈ సంస్థ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్లో అనేక సేవా కార్యక్రమాలు దాతృత్వ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రశంసలు పొందడం అభినందనీయమని తెలియజేశారు. ముఖ్యంగా కరోనా సమయంలో ఈ సంస్థ చేసిన సేవలు మరువలేనివని తెలియజేశారు. ఈ సంస్థ సభ్యులు అందరూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అన్ని విధాల మద్దతు తెలియజేస్తున్నందుకు ధన్యవాదాలు తెలియజేశారు. జగన్మోహన్ రెడ్డి గత ప్రభుత్వంలో క్రైస్తవులకు చేసిన మేళ్లను ఈ సందర్భంగా జాన్ వెస్లీ గుర్తు చేస్తూ క్రైస్తవ సంఘ కాపరులకు భారతదేశంలో




ఎక్కడా లేనివిధంగా 5000 రూపాయలను గౌరవ వేతనంగా ప్రకటించి దిగ్విజయంగా అమలు చేసిందని గుర్తు చేశారు. భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా 416 కోట్ల రూపాయలను గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో క్రైస్తవులకు ఆంధ్రప్రదేశ్లో ఖర్చు చేయడం జరిగిందని తెలియజేశారు. ఈ కూటమి ప్రభుత్వంలో క్రైస్తవులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని ముఖ్యంగా క్రైస్తవుల మీద క్రైస్తవ ఆలయాల మీద దాడులు అధికమయ్యాయి అని తెలియజేశారు. ఈ సమస్యలన్నిటికీ పరిష్కారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మరలా అధికారులకు వస్తేనే జరుగుతుందని తెలియజేశారు. అనంతరం ముఖ్యఅతిథిగా విచ్చేసిన జాన్ వెస్లీ మరియు బిషప్ తిమోతి లను , ఘనంగా సత్కరించారు

### వెనుకబడిన వర్గాలను
# మోసం చేసిన రాష్ట్ర ప్రభుత్వం

### జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి

**గుంటూరు (జయ జయహే)**



సుప్రీంకోర్టు ధర్మాసనం 2010 లోనే స్థానిక సంస్థలకు రిజర్వేషన్ 50 శాతం మించరాదని స్పష్టంగా తెలియజేసినా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెనుకబడిన తరగతుల ప్రజలను మభ్యపెట్టడానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ 105 జీవో, 1065 జీవోలను విడుదల చేసిందని ఈనెల 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆ జీవోలను రద్దుచేసి 6 వారాలలో ఎన్నికల ప్రక్రియను ప్రారంభించి పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించిందని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ఈనెల 1వ తేదీన గుంటూరులోని జనచైతన్య వేదిక కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పేర్కొన్నారు. తమిళనాడు ప్రభుత్వం 1993 – 94 లో రిజర్వేషన్లు 69 శాతం ఉండాలని చట్టం తేవడం 1994లో పార్లమెంట్ 76వ రాజ్యాంగ సవరణ ద్వారా తమిళనాడులో రిజర్వేషన్ 69 శాతానికి వర్తింపచేస్తూ 9 వ షెడ్యూల్ చేర్పించి గత 30 సంవత్సరాలుగా అమలు చేస్తున్న తీరును గమనించకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 105, 1065 జీవోల ద్వారా బీసీలకు 34 శాతం రిజర్వేషన్ లు స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలు చేయాలని ప్రయత్నించడం అవివేకమని, బీసీలను మభ్యపెట్టడానికే అని వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి పేర్కొన్నారు. డెడికేటెడ్ కమిషన్ ప్రక్రియ పూర్తి కాకుండానే, నివేదిక అందకుండానే, అసెంబ్లీలో చట్టశీను రూపొందించకుండా 34 శాతం బీసీలకు రిజర్వేషన్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తొందరపాటు చర్యగా పేర్కొన్నారు. ఇదే ప్రయత్నం 2019 – 20 లోనాటి వైఎస్సార్ సిపి ప్రభుత్వం కూడా చేసి అభాసు పాలైందన్నారు. 1992లోనే 9 మందితో కూడిన సుప్రీంకోర్టు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం విద్య ఉద్యోగాలలో రిజర్వేషన్ 50 శాతం దాటకూడదని పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు తీర్పు పై సుప్రీంకోర్టుకు వెళ్లాలనే ఆలోచనను విరమించుకుని డెడికేటెడ్ కమిషన్ నివేదికను సిద్ధం చేసుకుని, అసెంబ్లీలో చట్టశీ రూపొందించి, పార్లమెంట్ లో రాజ్యాంగ సవరణ కోసం పోరాడాలని గుర్తు చేశారు.



### విశాఖ మేయర్ పదవిని
# ఎస్సీలకు కేటాయించాలి

### దళిత గిరిజన జేఏసీ నేత పెద్దాడ రమణ డిమాండ్

**సీతంపేట, అక్టోబర్ 1, జయ జయహే**

విశాఖపట్నం మహానగరపాలక సంస్థ (జీవీఎంసీ) మేయర్ పదవిని ఎస్సీ వర్గానికి కేటాయించాలని దళిత గిరిజన జేఏసీ నాయకుడు పెద్దాడ రమణ డిమాండ్ చేశారు. సీతంపేటలోని దళిత గిరిజన జేఏసీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.విశాఖ మేయర్ స్థానాన్ని ఎస్సీలకు కేటాయించాలనే డిమాండ్తో త్వరలోనే నగరంలోని అన్ని వార్డుల్లో విస్తృతంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు పెద్దాడ రమణ తెలిపారు. ఈ డిమాండ్కు ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు కూడా పూర్తి సంఘీభావం ప్రకటించినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా నాయకులు గనగల్ల రాజేష్, కారి చిన్న, ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ తదితరులు మాట్లాడుతూ ఎస్సీలకు మేయర్ పదవి కేటాయించాలన్న డిమాండ్కు తమ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో దళిత, గిరిజన జేఏసీ ప్రతినిధులు పాల్గొన్నారు.



# అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

### మండల ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు..

**కొయ్యూరు : (జయ జయహే న్యూస్ )అక్టోబర్ 02,**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం మూలపేట పంచాయతీ మర్రిపాలెం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది.తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు, చింతపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ గర్రెంగి రాజేశ్వరి కలిసి లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా ముందుకు తీసుకెళ్తోందన్నారు. వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించిందని, కూటమి ప్రభుత్వం వచ్చాక 1వ తేదీనే పెన్షన్లు, ఉ ద్యోగులకు జీతాలు ఇస్తోందని తెలిపారు. ఆదివాసీ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామన్నారు. సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ లకు కృతజ్ఞతలు తెలిపారు.



# చంద్రబాబు పాలనలోనే అభివృద్ధి

### టీడీపీ గుంటూరు బీసీ సెల్ అధ్యక్షులు రాచకొండ లక్ష్మయ్య

**గుంటూరు, అక్టోబర్ 1, జయ జయహే**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలో ప్రజలకు ఉపయోగపడే అనేక అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అమలయ్యాయని తెలుగుదేశం పార్టీ గుంటూరు జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి రాచకొండ లక్ష్మయ్య అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యుడు మహమ్మద్ నజీర్ సూచనల మేరకు 51వ డివిజన్ కార్పొరేటర్ ముప్పవరపు భారతి, డివిజన్ అధ్యక్షుడు బొంతల సాయి ఆధ్వర్యంలో వికలాంగులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో లక్ష్మయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు తొలిసారిగా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం జన్మభూమి, ఇంకుడు గుంతలు, డ్వాక్రా, రైతు బజార్లు, ఈ–సేవ వంటి పలు కార్యక్రమాలను అమలు చేశారని తెలిపారు. హైటెక్ సిటీ అభివృద్ధి, మహిళా స్వయం సహాయక సంఘాల ప్రోత్సాహం, బడుగు బలహీన వర్గాలకు వివిధ సహాయ కార్యక్రమాలు, రైతులు––వినియోగదారుల మధ్య దళారుల వ్యవస్థను తగ్గించే ప్రయత్నాలు, పట్టిసీమ వంటి నీటి ప్రాజెక్టులు, అమరావతి అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రస్తావించారు. చంద్రబాబు పాలనలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇచ్చారని లక్ష్మయ్య పేర్కొన్నారు. అయితే, రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం విషయంలో అది ప్రభుత్వ––ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేసిన ప్రాజెక్టు కాగా, 2008లో ప్రారంభమైంది.



# జనసేన ఆధ్వర్యంలో పెన్షన్ల పంపిణీ..

**కొయ్యూరు : (జయ జయహే న్యూస్ ) అక్టోబర్ 02,**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం గదవపాలెం పంచాయతీ లో అరకు–పాడేరు నియోజకవర్గ జనసేన ఇన్ఛార్జ్ వంపూరు గంగులయ్య ఆదేశాల మేరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.పంచాయతీ అధ్యక్షుడు చిన్ని ఎర్రమనాయుడు ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందితో కలిసి అర్హులకు పెన్షన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో రావణాపల్లి సీనియర్ నాయకుడు, అరకు పార్లమెంటరీ సభ్యుడు సీహెచ్ సిద్దు (సత్తిబాబు), జనసేన నాయకులు బ్రహ్మోజీ, ఎస్ రాజుబాబు పాల్గొని, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.




# పట్టాలు చెల్లవంటే.. మూడు సెంట్ల హామీ సంగతేంటి?"

### ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి : మజ్జి అప్పారావు

**రాజమహేంద్రవరం: జయ జయహే :**

అక్టోబర్ 2:వైఎస్సార్సిపి ప్రభుత్వ హయాంలో అప్పటి రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన మంజూరు చేసి పంపిణీ చేసిన ఇళ్ల పట్టాలను ప్రస్తుత పాలకులు 'దొంగ పట్టాలు'గా పేర్కొనడం సరికాదని వైఎస్సార్సిపి మున్సిపల్ వింగ్ చైర్మన్ మజ్జి అప్పారావు అన్నారు. గురువారం రాజమహేంద్రవరం ప్రెస్క్లబ్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.రెవెన్యూ అధికారుల సంతకాలతో, ప్రజాప్రతినిధుల సమక్షంలో లబ్ధిదారులకు పంపిణీ చేసిన పట్టాలు నకిలీవని ఎలా చెబుతారని ప్రశ్నించారు. భరత్ హయాంలో పంపిణీ చేసిన పట్టాలు దొంగ పట్టాలని నిరూపించగలరా అని సవాల్ చేశారు. ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన మూడు సెంట్ల ఇంటి స్థలం హామీ ఏమైందని ప్రశ్నించారు.భరత్ హయాంలో నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టామని, ప్రస్తుత పాలకులు అభివృద్ధి పేరుతో నగరాన్ని నాశనం చేస్తున్నారని విమర్శించారు. పైపులైన్ల పనుల పేరుతో రోడ్లను ధ్వంసం చేశారని ఆరోపించారు. భరత్ చేసిన ఆరోపణలకు ఎమ్మెల్యే నేరుగా సమాధానం చెప్పకుండా లిక్కర్ సిండికేట్తో సమాధానం ఇప్పిస్తున్నారని మండిపడ్డారు. భరత్ హయాంలో సీఎం రిలీఫ్ ఫండ్తో సంబంధం లేకుండా ఆరోగ్యశ్రీ ద్వారా పూర్తిస్థాయి వైద్యం అందించేవారని తెలిపారు.వైఎస్సార్సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఆరే చిన్ని మాట్లాడుతూ తమ ప్రభుత్వ హయాంలో కొత్త పింఛన్లు ఇవ్వలేదన్న ఆరోపణలు సరికాదన్నారు. టిడిపి పాలనలో 39 లక్షల మందికి పింఛన్లు అందితే, జగన్ పాలనలో 66,34,720 మందికి పింఛన్లు అందించామని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం పింఛను రూ.4 వేలకు పెంచినప్పటికీ 6,42,000 పింఛన్లు తొలగించారని ఆరోపించారు. రెండున్నరేళ్లు గడిచినా కొత్త పింఛన్లు మంజూరు చేయలేదన్నారు. 50 ఏళ్లకే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పింఛన్లు ఇస్తామన్న హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో వైఎస్సార్సిపి ని గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తామని అన్నారు.సమావేశంలో వైఎస్సార్సిపి నాయకులు మార్తి నాగేశ్వరరావు, రొక్కం త్రినాథ్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మదీనా బాషా, తిరగటి దుర్గ, బిల్డర్ చిన్నా, నల్లా రామాంజనేయులు, కొమ్మోజు దుర్గారావు, కట్టా వెంకటేష్, విల్సన్, బాల శ్రీధర్, ఎన్. అప్పారావు, అరుణ్కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# మహిళలు బాలికల భద్రతపై పోలీస్ సదస్సు

### సామాజిక మాధ్యమాల వినియోగం పై జాగ్రత్తలు అవసరం

**టెక్కలి అక్టోబర్ 1 జయ జయహే**

మహిళలు బాలికల భద్రతపై స్వీయ భద్రత తో పలు జాగ్రత్తలు ఎంతో అవసరమని, అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ శాఖ సహాయం పొందేందుకు అవసరమైన చర్యలు అవగాహనపై ఐతం కళాశాల లో మహిళ లు బాలికల రక్షణ కోసం ప్రత్యేక శ్రద్ధతో వ్యక్తిగత భద్రత ఎంతో అవసరం అని పోలీస్ శాఖ శక్తి బృందం విద్యార్థులకు అవగాహన ఏర్పరిచారు, విద్యార్థుల పట్ల గుడ్ టచ్ బ్యాడ్ టచ్ ,సామాజిక మాధ్యమాల వినియోగం అత్యవసర సమయంలో 100,112, శక్తి యాప్ వినియోగం గూర్చి వివరంగా అవగాహన కల్పించారు, ఈ కార్యక్రమంలో శక్తి టీం ప్రతినిధులు గిరిధర్, ప్రభావతి, ధనలక్ష్మి, కళాశాల ప్రతినిధులు సుధాకర్, మారుతి ప్రసాద్, విద్యార్థినులు పాల్గొన్నారు.



### రాంపురంలో సిద్ధి వినాయక
# నవరాత్రి సంబరాలు

**పెందుర్తి, అక్టోబర్ 1, జయ జయహే :**

విశాఖపట్నం జిల్లా పెందుర్తి నియోజకవర్గం పెందుర్తి మండలం రాంపురం గ్రామంలో సాఫ్ట్వేర్ బాయ్స్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ సిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఏపీ ఆయిల్ఫెడ్ చైర్మన్, పెందుర్తి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి గండి బాబ్జి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా గండి బాబ్జి మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీ సిద్ధి వినాయక స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో విశాఖపట్నం మాజీ జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, సబ్బవరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు గండి దేముడు, గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు వెన్నెల సన్యాసినాయుడు, కుచ్చు కన్నయ్య, అన్నంరెడ్డి బంగారునాయుడు, దొడ్డి శ్రీధర్, అన్నంరెడ్డి బంగారయ్య, అన్నంరెడ్డి శ్రీను, సాఫ్ట్వేర్ బాయ్స్ యువజన సంఘం సభ్యులు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

For a pure tomorrow.. జయహే

# వసతిగృహం విద్యార్థులకు భరోసా

**మాడుగుల, అక్టోబర్ 1 జయ జయహే.**

విద్యార్థులకు విద్యతోపాటు వారికి నాణ్యమైన ఆహారాన్ని వసతిని అందించేందుకు ఏర్పాటుచేసిన వసతి గృహం విద్యార్థులకు ఒక భరోసా లాంటిదని మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు చెప్పారు. గురువారం మాడుగుల్లో బాలికల వసతి గృహాన్ని గర్ల్స్ హై స్కూల్ ప్రాంగణంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులందరూ సద్వినియోగపరచుకొని మంచి విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వి రవీంద్రనాథ్, ఎండి ఓకే అప్పారావు, టిడిపి మండల అధ్యక్షులు నందారపు సన్యాసిరావు, టిడిపి మండల కార్యదర్శి పుప్పాల రమేష్, బిజెపి మహిళా మోర్చా ఉత్తరాంధ్ర ఇన్చార్జ్ మండల సంతోషి సుబ్బలక్ష్మి. టిడిపి పట్టణ అధ్యక్షులు పుప్పాల లక్ష్మీనారాయణ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు సక్రమంగా చదువుకోవాలని వారికి అవసరమైన అన్ని రకాల వసతులు ఈ హాస్టల్లో ఏర్పాటు చేశారని అన్నారు. ఈ హాస్టల్ లో 6నుండి 10వతరగతి వరకు వందమంది బాలికలకు అన్ని రకాల సదుపాయం ఉందని ప్రస్తుతం 50 మంది బాలికల మాత్రమే ఉన్నారని ఇంకా 50 మందికి అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని బాలికలు వినియోగించుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు హిమబిందు కోరారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు లెక్కల



కాశిబాబు,క్లస్టర్ ఇంచార్జ్ బీశెట్టి విజయలక్ష్మి, కోపరేటివ్ అధ్యక్షులు కొట్నాల త్రినాథ్, క్లస్టర్ ఇంచార్జి వడ్డిరాజ్ కుమార్,కె. సొమన్న దొర. మరువాడ ఈశ్వర రావు, తాడి గణేష్ మిస్కా గంగరాజు, బొడ్డేటి నాయుడు, దువ్వా శంకర్, కూడా వెంకటేశ్వర రావు,వడ్డాదిబాబు, కోన రామకృష్ణ,వి.జాన్సీ, స్కూల్ కమిటీ చైర్మన్ నకిరెడ్డి సాయి లక్ష్మి, హాస్టల్ వార్డెన్ కర్రి లక్ష్మి ఉపాధ్యాయులుపాల్గొన్నారు.



# పేదల చెంతకే సంక్షేమం!

**రాజమహేంద్రవరం : జయ జయహే : అక్టోబర్ 2**

పిడింగొయ్యిలో గురువారం 'పేదల సేవలో 2.0' కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, సహాయ కలెక్టర్ కె. ఆదిత్య శర్మ ప్రజలతో మమేకమై సమస్యలను తెలుసుకున్నారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరణ వాహనాలకు అందించాలని, తడి చెత్తతో కంపోస్టు తయారు చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా చెత్త సేకరణ వాహనాన్ని నడిపి ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లాలో 2.67 లక్షల మందికి నెలకు సుమారు రూ.120 కోట్ల పింఛన్లు అందుతున్నాయని, లబ్ధిదారుల ఎంపికలో లోపాలుంటే సరిదిద్దుతామని చెప్పారు.ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో పాటు వివిధ వర్గాలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం పెరగాలని, తాగునీటి సమస్య పరిష్కారంతో పాటు బొమ్మూరు--కృష్ణానగర్--పిడింగొయ్యి--శ్రీకృష్ణపట్నం రహదారి విస్తరణకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. అవసరమైన చోట్ల ఆక్రమణల తొలగింపునకు ప్రజలు సహకరించాలని కోరారు.అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి యోగక్షేమాలు తెలుసుకుని ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేశారు. సాంకేతిక కారణాలతో రెండు నెలలుగా పింఛన్ పొందని మంగిరెడ్డికి రెండు నెలల మొత్తాన్ని ఒకేసారి అందించారు. గ్రామీణ మహిళలకు కుట్లు, అల్లికలు, బ్యూటీ పార్లర్ తదితర నైపుణ్య శిక్షణలు ఇచ్చి ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.కార్యక్రమంలో ఎంపిడిఓ సిహెచ్. సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, ఎఎంసి చైర్మన్ మార్ని వాసుదేవ్, మండల పార్టీ అధ్యక్షుడు మత్యేటి ప్రసాద్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి మజ్జి పద్మావతి, నియోజకవర్గ పరిశీలకులు కె. శ్రీనివాస్ యాదవ్, మట్ట శ్రీను, కోరాడ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి అలీ, ముప్పిడి రాంబాబు, బొప్పన నాగేశ్వరరావు, మార్ని దొరబ్బాయి, కసిరెడ్డి దుర్గాప్రసాద్, కొలుకులూరి కేదారి, కాప శ్రీను, మరుకుర్తి వెంకటేశ్వరరావు, కందిరిల్లి సత్తిబాబు, పంచికట్ల పోతురాజు, కాండ్రేగుల గోవిందు, చిచ్చారి సుబ్బారావు, బత్తుల శివ, అంకం అయ్యన్న, పెంట కుమారి తదితరులు పాల్గొన్నారు.



# సకురు వీధిలో గణపతి నోట్ల దండ రూ.1.20 లక్షల వేలం

**చోడవరం,అక్టోబర్ 1,జయ జయ హే**



చోడవరం సకురు వీధిలో యంగ్ బాయ్స్ టీమ్ ఆధ్వర్యంలో గురువారం వినాయకుడి నిమజ్జనం సందర్భంగా మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉత్సవాల సందర్భంగా గణపతికి అలంకరించిన. రూ.3,000 విలువైన నోట్ల దండకు వేలం నిర్వహించగా, చెంగల్వ కలెక్షన్స్ నిర్వాహకులు నిడుగొండ సంతోష్‌కుమార్, ఝాన్సీ దంపతులు రూ.1.20 లక్షలకు దక్కించుకున్నారు. అలాగే లడ్డూ వేలం నిర్వహించగా, గాజుల రామకృష్ణ--సంధ్య కుటుంబ సభ్యులు రూ.8,200లకు లడ్డూను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన భక్తులు, దాతలు, స్థానికులు, యువతకు సకురు వీధి యంగ్ బాయ్స్ టీమ్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.




# రహదారులకు శంకుస్థాపన

**మాడుగుల అక్టోబర్ 1 జయజయః**

మాడుగుల మండలం పొంగలిపాక పంచాయతీకి పల్లె పండగ 3.0 లోభాగంగా 30 లక్షలు రూపాయలు సిమెంట్ రోడ్లు నిర్మాణానికి మంజూరు అయ్యాయి. దీంతో ఈ నిధులతో బంటు వారి వీధిలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి గురువారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోటమ నాయకులు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



# ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే సీఎం చంద్రబాబు లక్ష్యం

**మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి**

**ముగ్గురికి సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ**

**దేవరాపల్లి, అక్టోబర్ 1, జయ జయహే**

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. గురువారం మామిడిపల్లి గ్రామంలో అనారోగ్యానికి పాల్పడిన ముగ్గురు బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ. 7 లక్షల 52 వేల 885 ల చెక్కులను బాధితులకు అందజేశారు. రైవాడ గ్రామానికి చెందిన వరుపూల శైలజ కు ( ఎల్ ఓ సి ) రూ. 6 లక్షల 25 వేల 901లు, పెదనందిపల్లి గ్రామానికి చెందిన పెనగంటి సుశాంత్ కు రూ. 70,105 లు, మామిడిపల్లి గ్రామానికి చెందిన కర్రి నరసింహమూర్తికి రూ. 56, 879 లు చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేక అధికారి మంజులావాణి, డుమ్మా పిడి నిర్మలాదేవి, జిల్లా వ్యవసాయ అధికారి, నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఆశా దేవి, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టిడిపి సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, జనసేన టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గొర్రెపోటు రామ్మూర్తి నాయుడు, పెద్దాడ వెంకటరమణ, స్థానిక టిడిపి నాయకులు లెక్కల సత్యనారాయణ, పోతల రాజు నాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# యూట్యూబర్ రావణ్‌కు షాక్

**దర్యాప్తు గడువు మరో 30 రోజుల పొడిగింపు**

**జయ జయహే**

యూట్యూబర్ రావణ్‌పై చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద నమోదైన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు దర్యాప్తు గడువును మరో 30 రోజుల పాటు పొడిగిస్తూ కృష్ణా జిల్లా కోర్టు ఈరోజు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే, ప్రశ్న రావణ్‌పై నమోదైన ఉపా కేసులో చట్ట ప్రకారం నిర్దేశించిన 90 రోజుల దర్యాప్తు గడువు రేపటితో (అక్టోబర్ 2) ముగియనుంది. ఈ నేపథ్యంలో, కేసులో మరింత లోతైన విచారణ జరిపి, కీలక ఆధారాలు సేకరించేందుకు అదనపు సమయం అవసరమని దర్యాప్తు అధికారులు భావించారు. ఈ మేరకు గడువును పొడిగించాలని కోరుతూ కృష్ణా జిల్లా కోర్టులో ప్రత్యేక పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను పరిశీలించిన న్యాయస్థానం, దర్యాప్తు అధికారుల విజ్ఞప్తిని అంగీకరించింది. విచారణ పూర్తి చేయడానికి మరో 30 రోజుల గడువు ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది. రావణ్ మావోయిస్టు భావజాలాన్ని ప్రచారం చేస్తున్నాడని, సాయుధ విప్లవానికి మద్దతు ఇస్తున్నాడని జనసేన నేత ఒకరు చేసిన ఫిర్యాదు మేరకు జూలై నెలలో పోలీసులు రావణ్‌ను అరెస్టు చేసి ఉపా కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.



# దేవరాపల్లిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ

**దేవరాపల్లి, అక్టోబర్ 1, జయ జయహే**

మండల కేంద్రం దేవరాపల్లిలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి ఆదేశాల మేరకు దేవరాపల్లి మాజీ ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు ఆధ్వర్యంలో గురువారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, దీవి శంకర్రావు, గవిరెడ్డి సింహ, గుల్లిపల్లి మురళి, బండారు అప్పలనాయుడు, అల్లు అబద్ధం, కాకినాడ సిద్దు, కొల్లి సురేష్, సబ్బవరపు మాలిబాబు, పోతురాజు సబ్బవరపు శంకర్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**రోడ్డు ప్రమాదంలో రైవాడకు చెందిన వ్యక్తి మృతి**

దేవరాపల్లి, అక్టోబర్ 1, జయ జయహే : అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం పినగాడి సమీపంలో చిన్నయ్యపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవరాపల్లి మండలంలోని రైవాడ గ్రామానికి చెందిన శీర రమణ (52) మృతి చెందారు. బుధవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో విశాఖ నుంచి ద్విచక్ర వాహనంపై రైవాడ వస్తున్న ఆయన చిన్నయ్యపాలెం వద్ద తన వాహనాన్ని నిలిపి కాల కృత్యాలు తీర్చుకుంటుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు అతనిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే చనిపోయారు. ఈయన గత కాలంగా బిజెపి కార్యకర్తగా పనిచేస్తున్నారు. సబ్బవరం ఎస్సై సింహాచలం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# శిథిలావస్థలో ఉన్న పాఠశాలభవనాలు తొలగించండి

**మాడుగుల, అక్టోబర్ 1 , జయ జయహే**

మాడుగుల మండలంలో శిథిలావస్థత చేరిన పాఠశాల భవనాలను రెండు రోజుల్లో తొలగించాలని మండల ప్రత్యేక అధికారి బి రవీంద్రనాథ్ ఆదేశించారు. మండలంలో ఎనిమిది పాఠశాల భవనాలు శిథిలవస్థకు చేరుకున్నాయని ఎంఈఓ ఇచ్చిన నివేదిక ప్రకారం గురువారం ఎండిఓకే అప్పారావు కలిసి ఆయన పోతనపూడిలో పాఠశాల భవనాన్ని పరిశీలించారు. అలాగే మండలంలో తాటిపర్తి, మాడుగుల, చింతలూరు, ఎం కోటపాడు తదితరు గ్రామాల్లో పాఠశాల భవనాలు శిథిలవస్థకు చేరాయిని వాటిని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. శనివారం లోగా ఈ భవనాలు తొలగించాల్సిందిగా పంచాయతీ అభివృద్ధి అధికారి కి సూచించారు.




# ఆదర్శం పొట్టి శ్రీరాములు జీవితం

**మాడుగుల అక్టోబర్ 1**

భాషా ప్రయుక్త రాష్ట్రాలకు ప్రాణం పోసిన అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమని, తెలుగు ప్రజల కోసం ఆయన చేసిన ప్రాణార్పణం చిరస్మరణీయమని అనకాపల్లి పొట్టి శ్రీరాములు ట్రస్టు ప్రతినిధి పి మూర్తి చెప్పారు. గురువారం మాడుగుల మండల పరిషత్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మాడుగుల విజేంద్ర ప్రముఖ వ్యాపారి కెవిపి ఆంజనేయులుతో కలిసి ఆయన పాల్గొని ఆంధ్ర రాష్ట్ర అవతరణ జరిగే 74 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అమరజీవి సేవలను కొనియాడుతూ 74 అమరజేవి జీవిత చరిత్ర పుస్తకాలను విద్యార్థులకు అందజేసి ఆయన గురించి వివరించారు. పొట్టి శ్రీరాములు ఆత్మ అర్పణ ఫలితంగా కర్నూలు కేంద్రంగా మొదటిసారిగా తెలుగు రాష్ట్రం ఏర్పాటు అయిందన్నారు. ఈ సందర్భంగా అమరజీవి జీవిత చరిత్రపై విద్యార్థులకు కుశల ప్రశ్నలు వేసి బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోప్పోజి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది

# సీటీయూఏపీలో ఘనంగా స్వచ్ఛతా హీ సేవా

**విజయనగరం, అక్టోబర్ 1, (జయ జయహే)**

"స్వచ్ఛతలో భాగస్వామ్యం -- స్వచ్ఛ భారత్, వికసిత భారత్" అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవా--2026 కార్యక్రమంలో భాగంగా, కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఆంధ్రప్రదేశ్‌లో క్లీన్ డ్రైవ్, శ్రమదానం మరియు స్వచ్ఛత ప్రతిజ్ఞ కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఉపకులపతి ప్రొ. టి. శ్రీనివాసన్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొ. జితేంద్ర మోహన్ మిశ్రా, ఇతర బోధనా, బోధనేతర అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు శ్రమదానంలో పాల్గొని క్యాంపస్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సామూహికంగా స్వచ్ఛత కార్యక్రమం చేపట్టారు. అనంతరం స్వచ్ఛత, పరిశుభ్రత మరియు పర్యావరణ పరిరక్షణపై స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. ప్రొ. టి. శ్రీనివాసన్ మాట్లాడుతూ, పరిశుభ్రమైన క్యాంపస్ ఆరోగ్యకరమైన వాతావరణానికి పునాది అని, స్వచ్ఛతను ప్రతి ఒక్కరూ తమ రోజువారీ జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రొ. జితేంద్ర మోహన్ మిశ్రా మాట్లాడుతూ, స్వచ్ఛత అనేది కేవలం ఒక కార్యక్రమానికి పరిమితం కాకుండా నిరంతర సామూహిక బాధ్యతగా కొనసాగాలని, విద్యార్థులు మరియు సిబ్బంది ఇందులో చురుకుగా భాగస్వాములు కావాలని అన్నారు. కార్యక్రమంలో డా. సురేష్ బాబు, ప్రొ. శంకర్ రెడ్డి కొల్లే, డా. దివ్య కె., డా. పి. రమా ఛటర్జీ, డా. పి.ఎస్. లతా కల్యాణ్‌పూడి, డా. వనం మహేష్, డా. సూర్య నారాయణ, డా. సి. హెచ్. నరసింహ, సెక్షన్ ఆఫీసర్--ఇన్‌చార్జి శ్రీ గండికోట వెంకటేష్, అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.







## శ్రీ ప్రకాష్ విద్యానికేతన్‌లో మాదక ద్రవ్యాలపై అవగాహన

**రాజమహేంద్రవరం: జయ జయహే: అక్టోబర్ 2**

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించుకోవాలని పోలీసులు విద్యార్థులకు సూచించారు. ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు దివాన్‌చెరువులోని శ్రీ ప్రకాష్ విద్యానికేతన్‌లో గురువారం మాదక ద్రవ్యాల నిరోధక చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మాదక ద్రవ్యాల నిరోధక విభాగం ఇన్‌స్పెక్టర్ వై. రాంబాబు, రాష్ట్ర ఈగల్ విభాగం ఇన్‌స్పెక్టర్ బి. సూర్య మోహనరావు, బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ పి. కాశీ విశ్వనాధం మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు యువత ఆరోగ్యం, కుటుంబం, భవిష్యత్తును దెబ్బతీస్తాయని, వాటి వినియోగం, అక్రమ రవాణాకు దూరంగా ఉండాలని సూచించారు. సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. అనంతరం సుమారు 500 మంది విద్యార్థులతో మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం. విమల, మేనేజర్ ఏఎస్ఎన్. మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పైలట్...స్మిత్ భారతీయుడు కావటం గర్వకారణం

**ఏలూరు, జయ జయహే**



ప్రాణాలకు తెగించి 174 మంది ప్రయాణికుల ప్రాణాలు కాపాడిన స్మిత్ మచ్చార్న కు కేంద్ర ప్రభుత్వ పారిశ్రామిక మండలి మాజీ సభ్యుడు పులి శ్రీరాములు అభినందనలు తెలిపారు. ఫ్లై దుబాయ్ ఎయిర్ లైన్స్ బోయింగ్ విమాన పైలట్ గాఅయిన స్మిత్ భారతీయుడు కావడం గర్వకారణంఅని శ్రీ రాములు ప్రశంసల వర్షం కురిపించారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన లో ఒమన్ దేశ కో-పైలట్ విమానాన్ని కూల్చటానికి చేస్తున్న ప్రయత్నాన్ని స్మిత సాహసం తో అడ్డుకుని, కత్తిపోట్లకు గురైనప్పటికీ, కూలిపోతున్న విమానాన్ని నియంత్రించటం సాహసోపేతం అని కొనియాడారు. విమానం ను ఆత్మస్థైర్యంతో సురక్షితంగా సౌదీ విమానాశ్రయంలో దింపిన పైలట్ స్మిత్ ని రియల్ హీరో గా పులి అభివర్ణించారు. ప్రపంచ మంతా స్మిత్ ను అభినందించటం భారతీయులకు గర్వ కారణమన్నారు. 11 సంవత్సరాలు స్పైస్ జెట్ లో పనిచేసి, 9,500 గంటలు విమానం నడిపిన, బోయింగ్ 737 పైలట్ల కు శిక్షణ నిచ్చిన స్మిత్ లాంటి సమర్థుడు, మేధావి విదేశీ విమానయాన సంస్థ ఫ్లై దుబాయ్ లో ఎందుకు చేరాడో? భారతీయ మేధావులు విదేశాలకు వలస ఎందుకు వెళ్తున్నారో ఆలోచించవలసిన సమయం ఆసన్నమైందని శ్రీరాములు పేర్కొన్నారు.

## ఐలు మహాసభలు మహాసభలను జయప్రదం చేయండి

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 01, జయ జయహే**



శ్రీకాళహస్తి ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ (ఐలు) మహాసభలు ఈ నెల 3, 4 తేదీల్లో నెల్లూరు నగరంలోని కస్తూరిబా కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు ఐలు నేత, న్యాయవాది కాకి చిన్న అంకయ్య తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, భారత రాజ్యాంగ రక్షణ, న్యాయవాదుల రక్షణ చట్టం, రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న 'లా నేస్తం' నిధుల విడుదల, న్యాయవాదులకు హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం తదితర అంశాలపై మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులకు రక్షణ లేకుండా పోయిందని, వారిపై భౌతిక దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాదులు అధిక సంఖ్యలో మహాసభలకు హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



### తొట్టంబేడు మండలంలో
## నూతన పెట్రోల్ బంక్ ప్రారంభం

**తొట్టంబేడు, అక్టోబర్ 01, జయ జయహే**

తొట్టంబేడు మండలంలోని పీఏసీఎస్ సింగిల్ విండో సహకార బ్యాంకు ఆధ్వర్యంలో తంగేళ్లపాలెం పీఏసీఎస్, హెచ్‌పీసీఎల్ భాగస్వామ్యంతో నిర్మించిన పెట్రోల్ బంక్‌ను గురువారం శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ప్రారంభించారు. రామచంద్రాపురం గ్రామం పిచ్చాటూరు రోడ్డులో ఈ పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఆశీస్సులతో పెట్రోల్ బంక్ ప్రారంభమైందని నిర్వాహకులు తెలిపారు. ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడం సంతోషకరమన్నారు. ఈ బంక్ అందుబాటులోకి రావడంతో స్థానిక ప్రజలు, రైతుల ఇంధన అవసరాలు సులభంగా తీరనున్నాయని పేర్కొన్నారు. పెట్రోల్ బంక్ ఏర్పాటుకు సంబంధించి స్థానికంగా కొందరు వ్యక్తులు స్థలంపై వివాదాలు సృష్టించినప్పటికీ, ఎమ్మెల్యే అధికారులకు, నాయకులకు తగిన సూచనలు చేసి పనులను వేగవంతం చేయడంతో బంక్ ప్రారంభానికి నోచుకుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ అమాస రాజశేఖర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రావెళ్ల మునిరాజా నాయుడు, తంగేళ్లపాలెం పీఏసీఎస్ చైర్మన్ బీమాల భాస్కర్ ముదిరాజ్, కాపుగున్నేరి పీఏసీఎస్ చైర్మన్ బత్తిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి డా. జి. దశరథాచారి, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, బీసీ భాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా. ఎం. ఉమేష్ రావు, తదితర ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు.



## పేద విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ

**ఏర్పేడు, అక్టోబర్ 01, జయ జయహే**

ఏర్పేడు మండలం పేదరిక నిర్మూలనకు విద్యే ఏకైక మార్గమని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ పేద విద్యార్థి చదువుకు దూరం కాకూడదన్నదే తన లక్ష్యమని ప్రముఖ సంఘ సేవకులు, విద్యాదాత డాక్టర్ యల్లంపాటి కోటేశ్వరబాబు అన్నారు. ఏర్పేడు మండలం కుప్పయ్య కండ్రిగ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం నిరుపేద విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరానికి సరిపడా నోట్ పుస్తకాలు, స్టేషనరీ తదితర విద్యాసామాగ్రిని ఆయన ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరబాబు మాట్లాడుతూ విద్య సమాజంలో మార్పు, సమానత్వానికి దోహదపడుతుందని, పేదరికాన్ని అధిగమించేందుకు చదువు బలమైన ఆయుధమని పేర్కొన్నారు. గత పదేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు తన వంతు సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో విద్యార్థులకు అవసరమైన సాయం అందించడం సంతృప్తినిస్తోందన్నారు. విద్యార్థులకు ఏడాది మొత్తానికి అవసరమైన విద్యాసామాగ్రిని అందించిన కోటేశ్వరబాబుకు పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జయకుమార్, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ తేజశ్రీ, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## రక్తదానం.. ప్రాణదానం

### యువత స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలి

**తిరుపతి, అక్టోబర్ 1, జయ జయహే**

తిరుపతి జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర రామనారాయణ రుయా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మోడల్ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం రక్తదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. బి. మనోహర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, అత్యవసర శస్త్రచికిత్సలు, ప్రసవ సమయంలో అధిక రక్తస్రావం, తలసేమియా, క్యాన్సర్, డెంగ్యూ తదితర సందర్భాల్లో రక్తం ఎంతో అవసరమని తెలిపారు. రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేమని, ఆరోగ్యవంతులైన స్వచ్ఛంద రక్తదాతలే ప్రధాన ఆధారమన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. వి. బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ రక్తదానం గొప్ప సామాజిక సేవ అని, యువత, విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదాతలను అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మోడల్ బ్లడ్ సెంటర్ డా. పి. భార్గవి, వైద్యులు, సిబ్బంది, సీకామ్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్, చాదలవాడ రమణమ్మ ఇంజినీరింగ్ కళాశాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## పింఛన్ల పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 01, జయ జయహే**

శ్రీకాళహస్తి పట్టణంలోని 20వ వార్డులో గురువారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి అవ్వాతాతలకు శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీనే లబ్ధిదారులకు పింఛన్లు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. గతంలో రూ. 2,000, రూ. 3,000గా ఉన్న పింఛన్లను ప్రస్తుతం రూ. 4,000, రూ. 6,000, రూ. 10,000 వరకు పెంచి అందిస్తున్నట్లు తెలిపారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఇప్పటివరకు సుమారు 85 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని, కొత్తగా దరఖాస్తు చేసుకున్న అర్హులకు వచ్చే నెల నుంచి పింఛన్లు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రిలో నాగయ్యను పరామర్శించిన మహిళా పోలీస్

**బుచ్చినాయుడు కండ్రిగ, అక్టోబర్ 1, జయ జయహే**



బుచ్చినాయుడు కండ్రిగ మండలం పార్లపల్లి స్వర్ణ గ్రామానికి చెందిన నాగయ్య షుగర్ వ్యాధితో బాధపడుతూ శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మహిళా పోలీస్ టీ. ఉదయశ్రీ గురువారం ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. అనంతరం నాగయ్యకు ఎన్‌టీఆర్ భరోసా పింఛన్‌ను అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో అందేలా కృషి చేస్తామని, అవసరమైన సమయంలో వారికి అండగా ఉంటామని ఈ సందర్భంగా ఉదయశ్రీ తెలిపారు. నాగయ్య త్వరగా కోలుకోవాలని ఆమె ఆకాంక్షించారు.

## మహాత్మ గాంధీ పుట్టినదే మన అందరికోసం

**భీమవరం (జయ జయహే)**



గాంధీగారు జన్మించిన నాడే నా గురించి పుట్టాడని పులకించిన భరతమాత. వారు దేశంకోసం చేసిన యాత్రమహోన్నతం. వారిగుణగణాలు అందరికి ఆదర్శాలు. లక్ష్యాన్నిమరువని కర్తవ్యసాధకుడు. వారు చేసినసత్యాగ్రహాలు, యాత్రలు దేశానికి వజ్రకవచాలు అయినవి. వారిత్యాగం, హిమాలయ మంత, వారినడక. సత్య ధర్మాలైనవి. వారి ధైర్య సాహసాలు బ్రిటిష్ వారి గుండెల్లో తూటాలైనవి. వారి రెండు చేతులు విశ్వ బాహువులైనవి కర్రశాంతి ఆయుధ మైనది. కళ్ళజోడు ముందు చూపుకి ప్రతీక అయినది. గాంధి భక్తి రామరాజ్యపాలనకు ప్రతీక అయినది వారు ధరించిన ఖాదీ వస్త్రం చేనేతలకు అభయహస్తమైనది. నూలు వడికారు. బ్రిటిష్ వారిని వణికించారు గాంధి దేశభక్తికి మూడు సింహాలు గర్జించాయి. దేశభక్తికి. పరవశించిన మువ్వన్నెల జెండ వారిదేశభక్తి కి విజయానికి అశోక చక్రం బహుమతి అయినది వారిని అనుసరించే దేశభక్తినాయకులు గాంధీవారసులే. గాంధీ త్యాగనిరతి యుగాంతం వరకు నిలిచి ఉంటుంది. గాంధీ నీవు భారతీయుల. హృదయస్థానానివి నిన్ను తలుచుకున్న ప్రతి భారతీయుడు భావి భారతి పౌరుడే.

# చిన్నారుల ప్రాణాలు బలిగొన్న అనుమానం

## అనుమానాల చీకటిలో ముగిసిన నలుగురు సభ్యుల కుటుంబ జీవితం

## భార్య, ఇద్దరు చిన్నారులను పొట్టనపెట్టుకున్న కుటుంబ విషాదం

(ప్రతాప్)




ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో కుటుంబ కలహాలు, భార్యపై వ్యక్తమైన అనుమానాలు ఘోర విషాదానికి దారితీశాయి. భార్య శీలంపై అనుమానం పెంచుకున్న ఓ వ్యక్తి తన భార్యతో పాటు ఇద్దరు మైనర్ కుమారులను కత్తితో హత్య చేసి, అనంతరం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. ప్రాథమిక దర్యాప్తులో కుటుంబ విభేదాలు, అనుమానాలే ఈ దారుణానికి కారణమై ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

పోలీసుల వివరాల ప్రకారం, బలోద్ జిల్లాకు చెందిన 36 ఏళ్ల భువనేశ్వర్ సాహూ రాయ్‌పూర్ నగరంలోని దుమ-ర్తరాయ్ ప్రాంతంలోని సాహూ పారాలో అద్దె ఇంట్లో కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. శనివారం రాత్రి ఇంట్లోనే ఉన్న కత్తితో తన భార్య ఖిలేశ్వరీ సాహూ (32), కుమారులు ఆషిష్ సాహూ (11), జాన్ సాహూ (8)లపై దాడి చేసినట్లు పోలీసులు వెల్లడించారు. అనంతరం అదే ఆయుధంతో తనను తాను గాయపరుచుకుని ఆత్మహత్యకు యత్నించినట్లు దర్యాప్తులో తేలింది.




సమాచారం అందుకున్న వెంటనే మానా పోలీస్ స్టేషన్ బృందం సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకుంది. తీవ్ర రక్తస్రావంతో ఉన్న ఇద్దరు బాలురు అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారించారు. గాయపడిన ఖిలేశ్వరీ సాహూను ఆసుపత్రికి తరలించినప్పటికీ అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. నిందితుడు భువనేశ్వర్ సాహూను అదుపులోకి తీసుకుని చికిత్స నిమిత్తం రాయ్‌పూర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ ఆసుపత్రి (మెకహారా)లో చేర్చినట్లు అధికారులు తెలిపారు.

నగర పోలీసు అధికారి వెల్లడించిన వివరాల ప్రకారం, భార్య శీలాన్ని అనుమానించడం వల్లే ఈ నేరం జరిగినట్లు ప్రాథమిక విచారణలో సంకేతాలు లభించాయి. అయితే సంఘటన వెనుక ఉన్న అన్ని కోణాలను పరిశీలిస్తున్నామని, కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికుల వాంగ్మూలాలను సేకరిస్తున్నామని అధికారులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించగా, ఫోరెన్సిక్ నివేదికలు అందిన తర్వాత ఘటనకు సంబంధించిన మరిన్ని అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. కుటుంబ విభేదాలు, అనుమానాలు, భావోద్వేగ నియంత్రణ లోపించడం వంటి అంశాలు ఎలాంటి విషాదాలకు దారితీస్తాయో ఈ సంఘటన మరోసారి చాటిచెప్పింది. సమాజంలో పెరుగుతున్న కుటుంబ హింస, మానసిక ఒత్తిళ్లు, పరస్పర విశ్వాసాభావం వంటి సమస్యలపై మరింత అవగాహన అవసరమని సామాజిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును కొనసాగిస్తున్నారు.



## మత్స్యకారులకు బియ్యం అందజేత

### మంత్రి కింజరాపు చొరవ, అభినందనీయం

సంతబొమ్మాళి (జయ జయహే)

తుపాను నేపథ్యంలో సముద్రంలో చేపల వేటకు వెళ్లలేని మత్స్యకార కుటుంబాలకు కూటమి ప్రభుత్వం 50 కిలోల బియ్యం అందజేయాలని నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలతో సంతబొమ్మాళి మండలం నౌపడా పంచాయతీ సీతానగరం గ్రామంలో 380 కుటుంబాలకు 50 కిలోల బియ్యం చొప్పున మాజీ సర్పంచి కర్రి విష్ణుమూర్తి సమక్షంలో తెదేపా సీనియర్ నాయకులు, మత్స్యకార సంఘం అధ్యక్షులు వాడరేవు కృష్ణారావు చేతుల మీదుగా లబ్ధిదారులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వాడరేవు కృష్ణారావు మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, మత్స్యకారుల కోసం రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చూపిన చొరవ.. స్ఫూర్తి హర్షణీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు లింగూడు కుమార్, తెదేపా నాయకులు మత్స్యకార ప్రధాన కార్యదర్శి బత్సల బ్రహ్మానందం, బత్సల గోపాల్, బత్సల చిన్నబాబు, సుగ్గు నాగిరెడ్డి, పొన్నాడ రామారావు, తదితరులు పాల్గొన్నారు.




## ఎం.అలమండలో వైభవంగా

# పోషణ మాసోత్సవాలు

### పరిశీలించిన ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

దేవరాపల్లి, అక్టోబర్ 1 జయ జయహే :

మండలంలోని ఎం అలమండ గ్రామంలో పోషణ మాసోత్సవాలు గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలలో ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణమూర్తి, డుమా పిడి నిర్మలాదేవి, మాడుగుల నియోజకవర్గం ప్రత్యేక అధికారిణి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆశాదేవి, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పాల్గొని అంగన్వాడి పిల్లలతో కాసేపు ముచ్చటించి పలు రకాల పిండివంటలను రుచి చూశారు. పిల్లలతో ఆటలాడుతూ, అంగన్వాడి కేంద్రంలో పిల్లలకు ఏమేమి పెడుతున్నారు అన్న వివరాలను పిల్లలని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఈ కార్యక్రమాలు సిడిపిఓ లలితకుమారి ఆధ్వర్యంలో దేవరాపల్లిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, రైవాడ జలాశయం చైర్మన్ పోతల పాత్రునాయుడు, ఎన్. కళ్యాణి, రాములమ్మ, ఆదిలక్ష్మి, అంగన్వాడి సిబ్బంది పి. అమ్మజీ, కె. చెల్లయ్యమ్మ, కె.మంగ, అంగన్వాడి సహాయకులు బి.తలుపులమ్మ, సిహెచ్. నాగమణి, ఏ.లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

## మమతా వర్గానికి

# సుప్రీంలో చుక్కెదురు

### రూ.804 కోట్ల ఖాతాలపై పిటిషన్ కొట్టివేత

జయ జయహే :



పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ వర్గానికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. స్తంభింపజేసిన నాలుగు బ్యాంకు ఖాతాలను వినియోగించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం గురువారం తోసిపుచ్చింది. ఈ ఖాతాల్లో సుమారు రూ. 804 కోట్ల మేర నిధులు ఉన్నట్లు సమాచారం. జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ పి.బి. వరాలేలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. కలకత్తా హైకోర్టు గతంలో జారీ చేసిన ఉత్తర్వులలో జోక్యం చేసుకునేందుకు ధర్మాసనం నిరాకరించింది. పార్టీలో నెలకొన్న వర్గపోరు కారణంగా కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే పార్టీ గుర్తును స్తంభింపజేసిందని, ఈ నేపథ్యంలో సదరు నిధుల యాజమాన్య హక్కులపై స్పష్టత రావాల్సి ఉందని కోర్టు అభిప్రాయపడింది. ఈ దశలో నిధుల వినియోగంపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేమని స్పష్టం చేస్తూ, కేసు విచారణను వేగవంతం చేయాలని కలకత్తా హైకోర్టును ఆదేశించింది. ఆర్థిక అవకతవకల ఆరోపణలు, పలు ఎఫ్ఐఆర్‌ల నమోదు నేపథ్యంలో పశ్చిమ బెంగాల్ పోలీసులు ఈ నాలుగు ఖాతాలను స్తంభింపజేశారు. దీనిపై మమతా వర్గం కలకత్తా హైకోర్టును ఆశ్రయించగా, ఆగస్టు 27న వారికి ఎటువంటి మధ్యంతర ఊరట లభించలేదు. అయితే, రోజువారీ పార్టీ నిర్వహణ ఖర్చుల కోసం కోర్టు నియమించిన ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో ఇతర ఖాతాలను పరిమితంగా వినియోగించుకోవడానికి హైకోర్టు అనుమతినిచ్చింది. ఖాతాల స్తంభనతో పార్టీ కార్యకలాపాలు నిలిచిపోతున్నాయని మమతా వర్గం వాదించినప్పటికీ, సుప్రీంకోర్టు మాత్రం హైకోర్టు నిర్ణయాన్నే సమర్థించింది.






# ఖైరతాబాద్ ఉపఎన్నికపై సస్పెన్స్

### నోటిఫికేషన్ నిలిపివేయాలని

### హైకోర్టును ఆశ్రయించిన విజయారెడ్డి!

జయ జయహే :

హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నిక వ్యవహారం అనూహ్య మలుపు తిరిగింది. బీఆర్ఎస్ గుర్తుపై గెలిచి కాంగ్రెస్‌లోకి మారిన దానం నాగేందర్‌పై పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటు పడటం, ఆ తర్వాత సుప్రీంకోర్టు సైతం దీనిని సమర్థించడంతో ఈ స్థానం ఖాళీ అయి ఉపఎన్నిక అనివార్యమైంది. అయితే, ఈ ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాలని కోరుతూ దివంగత సీనియర్ నేత పి.జనార్దన్ రెడ్డి కుమార్తె, కాంగ్రెస్ నాయకురాలు పి. విజయారెడ్డి తెలంగాణ హైకోర్టు తలుపు తట్టారు. కేంద్ర ఎన్నికల సంఘం ఎలాంటి ఉపఎన్నిక నోటిఫికేషన్ జారీ చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని ఆమె న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. 2023 సాధారణ అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా విజయం సాధించిన దానం నాగేందర్ ఎన్నికను సవాలు చేస్తూ విజయారెడ్డి 2024లోనే హైకోర్టులో ఎలక్షన్ పిటిషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ తరపున పోటీ చేసి ఆమె రెండో స్థానంలో నిలిచారు. దానం నాగేందర్ సమర్పించిన అఫిడవిట్‌లో పలు అవకతవకలు ఉన్నాయని, నామినేషన్ నిబంధనలకు విరుద్ధంగా గెలుపొందారని, కాబట్టి ఆయన ఎన్నిక ఎంతమాత్రం చెల్లదని ఆమె ఆ పిటిషన్‌లో స్పష్టం చేశారు. ప్రస్తుతం న్యాయస్థానంలో విచారణలో ఉన్న తన ఎలక్షన్ పిటిషన్‌పై తుది తీర్పు వెలువడే వరకు ఉపఎన్నిక నిర్వహణకు ఉపక్రమించవద్దని, అంతవరకు ఎలాంటి నోటిఫికేషన్ జారీ చేయకుండా ఈసీని ఆదేశించాలని ఆమె తాజా పిటిషన్‌లో కోరారు. గత సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన విజయారెడ్డి సమీప ప్రత్యర్థిగా రెండో స్థానంలో నిలిచారు. న్యాయస్థానంలో జరుగుతున్న విచారణలో దానం నాగేందర్ ఎన్నిక చెల్లదని తేలితే, మళ్లీ ఉపఎన్నిక నిర్వహించే అవసరం లేకుండానే రెండో స్థానంలో ఉన్న తనను విజేతగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయని విజయారెడ్డి విశ్వసిస్తున్నారు. అందుకే తక్షణమే ఉపఎన్నిక జరిపితే తన చట్టబద్ధమైన హక్కులకు భంగం వాటిల్లుతుందని, న్యాయస్థానం తన ఎలక్షన్ పిటిషన్‌పై తేల్చాకే ముందడుగు వేయాలని ఆమె భావిస్తున్నారు. విజయారెడ్డి వేసిన ఈ పిటిషన్ కాంగ్రెస్ పార్టీ వర్గాలతో పాటు తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. దానం నాగేందర్ అనర్హతతో మళ్లీ అదే స్థానం నుంచి పోటీ చేయాలని ఆశించిన పలువురు నేతలకు ఈ పిటిషన్ బిగ్ షాక్ ఇచ్చింది. ఒకవైపు సొంత పార్టీకి చెందిన నేతే ఉపఎన్నికను అడ్డుకునేలా కోర్టును ఆశ్రయించడం, మరోవైపు ఉపఎన్నికల ముంగిట ఖైరతాబాద్ కాంగ్రెస్ టికెట్ రేసు హీటెక్కడం రాజకీయ సమీకరణాలను వేగంగా మార్చేస్తోంది. ప్రస్తుతం ఖైరతాబాద్ ఉపఎన్నిక భవితవ్యం పూర్తిగా తెలంగాణ హైకోర్టు తీసుకోబోయే నిర్ణయంపైనే ఆధారపడి ఉంది. విజయారెడ్డి వేసిన పిటిషన్‌ను విచారణకు స్వీకరించి ఉపఎన్నిక నోటిఫికేషన్‌పై హైకోర్టు స్టే విధిస్తుందా? లేక ఎలక్షన్ కమిషన్ యథావిధిగా షెడ్యూల్ విడుదల చేసేందుకు అనుమతినిస్తుందా? అన్నది ఉత్కంఠగా మారింది. హైకోర్టు ఇవ్వబోయే స్పష్టతతోనే ఖైరతాబాద్‌పోరు తుది ఘట్టానికి చేరుకోనుంది.




## మద్యం కుంభకోణం

# విచారణ కీలక మలుపు

జయ జయహే :

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్న వైఎస్సార్‌సీపీ హయాంలోని మద్యం కుంభకోణం విచారణ కీలక మలుపు తిరిగింది. రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఓఎస్డీ దొడ్డ వెంకట సత్యప్రసాద్‌తో పాటు ఎక్సైజ్ శాఖ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ వంటి కీలక అధికారులు కోర్టుకు , దర్యాప్తు సంస్థ సెట్ కి ఇచ్చిన వాంగ్మూలాలు సంచలనం రేపుతున్నాయి. ఈ దందా మొత్తం నాటి సీఎంవో కనుసన్నల్లోనే జరిగిందని, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతోనే నిబంధనల ఉల్లంఘనలు, ముడుపుల వ్యవహారం నడిచిందని వారు వాంగ్మూలంలో పేర్కొనడం రాజకీయ సంచలనానికి దారితీసింది. అంతేకాకుండా, అంతిమ లబ్ధిదారు జగన్మోహన్ రెడ్డి అని సత్యప్రసాద్ ఏకంగా అప్రూవర్‌గా మారేందుకు సిద్ధమవ్వడం కేసును మరింత ఆసక్తికరంగా మార్చింది. చట్టపరమైన దృక్కోణంలో విశ్లేషిస్తే, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత సెక్షన్ 183 కింద మెజిస్ట్రేట్ ఎదుట నమోదు చేసే అధికారుల వాంగ్మూలానికి న్యాయస్థానంలో చాలా ప్రాధాన్యత ఉంటుంది. పోలీసులకు ఇచ్చే వాంగ్మూలంతో పోలిస్తే, జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ముందు ఇచ్చే వాంగ్మూలాన్ని సాక్షులు లేదా అధికారులు తదనంతరం మార్చడానికి వీలుండదు. కాబట్టి రజత్ భార్గవ, సత్యప్రసాద్ వంటి ఉన్నతాధికారులు తాము ఒత్తిడికి గురయ్యామని , ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకే ఫైళ్లపై సంతకాలు చేశామని మెజిస్ట్రేట్ వద్ద ధృవీకరిస్తే, అది చట్టప్రకారం ప్రధాన నిందితులకు, కుట్రదారులకు చుట్టుముట్టే బలమైన ప్రాథమిక సాక్ష్యంగా మారుతుంది. కేవలం అధికారుల , సహ నిందితుల వాంగ్మూలాలు మాత్రమే ఒకరిని దోషిగా తేల్చడానికి లేదా ఈ కేసులో వైఎస్ జగన్‌ను ప్రధాన నిందితుడు గా చేర్చి శిక్షపడేలా చేయడానికి సరిపోవు. భారతీయ సాక్ష్యాధారాల చట్టం ప్రకారం, అప్రూవర్ లేదా ప్రత్యక్ష సాక్షి చెప్పే మాటలకు మద్దతుగా స్వతంత్ర సాక్ష్యాలు తప్పనిసరి. కేవలం ఒక అధికారి సీఎం చెప్పారు అని వాంగ్మూలం ఇచ్చినంత మాత్రాన కోర్టు ఆమోదించదు. ఆ మాటలను నిరూపించేందుకు నాటి సీఎంవో ఫైల్స్, ఐఏఎస్ అధికారులకు పంపిన అంతర్గత మెమోలు, డిజిటల్ సాక్ష్యాలు , సీఎంవో అధికారుల అధికారిక సమీక్షల నిమిత్తం నమోదైన మినిట్స్ ఆఫ్ మీటింగ్ వంటి రికార్డులను దర్యాప్తు సంస్థలు కోర్టు ముందుంచాల్సి ఉంటుంది. ఇక ఈ కేసులో అత్యంత సంక్లిష్టమైన అంశం ? నగదు లావాదేవీల నిరూపణ . లిక్కర్ స్కామ్‌లో వేల కోట్ల రూపాయల ముడుపులు మారాయని ఆరోపిస్తున్నప్పుడు, ఆ డబ్బు ఎక్కడి నుండి బయలుదేరింది, ఏ హవాలా, బ్యాంకింగ్ మార్గాల ద్వారా పయనించింది, చివరకు అది జగన్మోహన్ రెడ్డికి లేదా ఆయన కుటుంబ సంస్థలకు, ట్రస్టులకు ఎలా చేరింది అనే విషయాన్ని పక్కాగా నిరూపించాల్సి ఉంటుంది. ఒకవేళ కేవలం అధికారులు రూ. 3200 కోట్లు జగన్‌కు చేరాయి అని వాంగ్మూలంలో చెప్పినప్పటికీ, దానికి సంబంధించిన ఫైనాన్షియల్ ట్రయిల్, ఆస్తుల జప్తు లేదా డిజిటల్ ప్రూఫ్స్ చూపించకపోతే, కేసు విచారణ దశలో చెల్లాచెదురయ్యే ప్రమాదం ఉంది. ప్రస్తుతం సిట్ , దర్యాప్తు సంస్థలు అనుసరిస్తున్న వ్యూహం ప్రకారం.. ముందస్తుగా అధికారుల నుంచి కుట్ర కోణాన్ని సేకరించి, ఆ తర్వాత ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ యాక్ట్, మనీ లాండరింగ్ కోణాల్లో నిధులను వెలికితీసే పనిలో ఉన్నారు. అధికారులను బెదిరించి లేదా ఒత్తిడి తెచ్చి సీఎంవో బాధ్యత వహించేలా నిర్ణయాలు తీసుకున్నారని ఆధారాలు లభిస్తే, కుట్రలో భాగస్వామిగా, లబ్ధిదారుగా జగన్‌ను కేసులో ο1గా చేర్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి మాజీ అధికారుల వాంగ్మూలాలు కేసును మలుపు తిప్పిన మాట నిజమే అయినా, అది జగన్మోహన్ రెడ్డి అరెస్టు లేదా ο1గా మార్చేందుకు కేవలం ఒక సపోర్టింగ్ పిల్లర్ మాత్రమే. ఈ వాంగ్మూలాల ఆధారంగా ప్రభుత్వం, సీఐడీ లేదా సిట్ బృందాలు క్షేత్రస్థాయిలో ఎంతవరకు పక్కాగా నగదు మార్పిడి రికార్డులు, డిజిటల్ ఆధారాలు, హవాలా లింకులను కోర్టు ముందు ఉంచుతాయో అనే దానిపైనే ఈ కేసు భవిష్యత్తు మరియు జగన్ లీగల్ భాగస్వామ్యం ఆధారపడి ఉంటుంది

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com